



Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4781

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 15 | ఆదివారం 23 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## ఒక్క రోజే.. 400 కేసుల పరిష్కారం

- సుప్రీంకోర్టు లోక్ అదాలత్‌కు విశేష స్పందన
- సమాధాన్ సమారోహ్ మూడురోజుల ప్రత్యేక డ్రైవ్
- 'సమాధాన్ సమారోహ్ ప్రత్యేక డ్రైవ్

**న్యూఢిల్లీ– సూర్య వాస్తవం :**
ఒక్క రోజే 400 కేసులను సుప్రీంకోర్టు ప్రత్యేక లోక్ అదాలత్ పరిష్కరించింది. వేగవంతమైన న్యాయ పరిష్కారాలు అందించేందుకు సర్వోన్నత న్యాయస్థానం మూడు రోజుల ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. 'సమాధాన్ సమరోహ్ 2026' పేరుతో చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మార్గదర్శకత్వంలో పని చేస్తోంది. ఇందులో భాగంగా మొదటి రోజైన శుక్రవారం 400 కేసుల్లో పరిష్కారాలు చూపింది. ఆదివారంతో ఈ లోక్ అదాలత్ ముగియనుంది.రోజువారీ వార్తాపత్రికలను సబ్‌స్క్రైబ్ చేయడం

- మిగతా 2లో..




## వందేమాతర గీతంపై దేశవ్యాప్త ప్రచారం

- కాంగ్రెస్ 'రెండు చరణాల గీతం' తీర్మానాన్ని ఖండిస్తున్నాం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్
- ఢిల్లీలో పార్టీ నూతన జాతీయ కార్యవర్గ తొలి సమావేశం
- గీతం గౌరవాన్ని కాపాడేందుకు 10 సూత్రాల తీర్మానానికి ఆమోదం

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం :**
'వందేమాతర గీతం భారతదేశ చారిత్రక వారసత్వం. అందుకే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆరు చరణాల గీతానికి చట్టబద్ధత కల్పించింది. కేవలం రెండు చరణాలు మాత్రమే తమకు సమ్మతమని కాంగ్రెస్ తీర్మానం చేయడాన్ని మేం ఖండిస్తున్నాం. సంపూర్ణ వందేమాతర గీతం పరిరక్షణే మా ధ్యేయం. జాతీయ గీత పరిరక్షణ కోసం బీజేపీ తన 10 సూత్రాల తీర్మానాన్ని అమలు చేయ



బోతున్నది' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రకటించారు. న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ అధ్యక్షతన నూత న జాతీయ కార్యవర్గ తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్యవర్గం వందే మాతర గీతంపై

- మిగతా 2లో..

## ఉత్సాహంగా బ్రిక్స్ సమావేశాలు



**విశాఖపట్నం– సూర్య వాస్తవం :**
నగరంలో బ్రిక్స్ దేశాల క్రీడా, యువజన మంత్రుల సమావేశాలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం తొట్లకొండపై సభ్య దేశాల ప్రతినిధులు 'తల్లి పేరుతో ఒక మొక్క' నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క మొక్క నాటారు. కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ, ఇతర బ్రిక్స్ దేశాల మంత్రులు, ఉన్నతాధికారులు చిరుజల్లులతో ఏర్పడిన ఆహ్లాదకర వాతావరణంలో ఫొటోలు దిగారు. అక్కడ నుంచి మనోహరంగా కనిపించే సముద్రాన్ని తిలకించారు. తరువాత రాడిసిన్‌బ్లూ హోటల్‌లో యువజన మంత్రుల సమావేశం నిర్వహించారు. అభివృద్ధిలో యువత సహకారం, భాగస్వామ్యం మరింత బలోపేతం చేయాలని తీర్మానించారు. ఆయా దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులను ఉద్దేశించి కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్యం 2047 నాటికి ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని లక్ష మంది యువ నాయకులను ప్రోత్సహించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని, ఆ స్ఫూర్తితో 'మై భారత్' పేరుతో ఒక వేదిక ఏర్పాటు చేశామన్నారు. బ్రిక్స్ దేశాల మంత్రులు, ప్రతినిధులకు శనివారం రాత్రి నోవాటెల్ హోటల్‌లో గాలా డిన్నర్ ఇచ్చారు. వివిధ రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే నృత్యరూపకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి

- మిగతా 2లో..

## జెన్ జీ కోసం
# బీజేపీ తంటాలు

- మోడీ 'రీల్స్' రాజకీయం.. అయినా సీరియస్‌గా తీసుకోని యువత
- ఒకప్పుడు వాట్సాప్, ఎక్స్‌లో 'విపరీత' ప్రచారాలు..
- నేడు ఇన్‌స్టాగ్రాంలో కొత్త రకం సవాలు
- యువత నిరసనలు, మీమ్స్, రీల్స్ ప్రభావంతో మారుతున్న రాజకీయ వాతావరణం?

దశాబ్దకాలంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి వేదికల ద్వారా తమ రాజకీయ సందేశాలను బలంగా ప్రచారం చేసిన బీజేపీకి ఇప్పుడు కొత్త తరం సోషల్‌మీడియా వాస్తవం సవాల్‌గా మారుతోంది. ముఖ్యంగా జెన్ జీని చేరుకునేందుకు ప్రధాని మోడీ, బీజేపీ ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్త శైలిని ఎంచుకుంటోంది. ఇందుకోసం నానా తంటాలు పడుతోంది. ఢిల్లీలో విద్యార్థులు, యువత నిరసన అనంతరం ఈ మార్పు కనబడింది. 'హలో ఫ్రెండ్స్' అంటూ ప్రధాని మోడీ ఇన్‌స్టా రీల్స్‌లో స్పందించినప్పటికీ.. యువత దానిని సీరియస్‌గా తీసుకోవడం లేదు. పైగా దానిని ఒక 'క్రింజ్' కంటెంట్‌గా చూస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం :**
భారత రాజకీయాల్లో సోషల్‌మీడియాను విరివిగా వినియోగించు కొని ప్రజల మెదళ్లను కలుషితం చేయడంతో బీజేపీ ముందుంటుంది. ఇది ఎంతలా మారిందంటే 'వాట్సాప్'లో వచ్చే గాలి వార్తలు కూడా నిజమని నమ్మించేలా. అందుకే ఆ పార్టీకి 'వాట్సాప్ యూనివర్సిటీ' అనే వ్యంగ్యమైన ట్యాగ్ వచ్చింది. ఒక్క వాట్సాప్ మాత్రమే కాదు.. ఫేస్‌బుక్ పేజీలు, ఎక్స్ ఖాతాల ద్వారా ఆ పార్టీ తాను తన రాజకీయ సందేశాన్ని విస్తృతంగా తీసుకెళ్లింది. అయితే సోషల్‌మీడియా ప్రపంచం మారుతోంది. యువత ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, మీమ్స్, షార్ట్ వీడియోలు, లైవ్‌స్ట్రీమ్స్ ద్వారా రాజకీయాలను చూస్తున్న తరుణంలో.. పాత డిజిటల్ వ్యూహాలు సరిపోతాయా అన్న ప్రశ్న బీజేపీ ముందుకొచ్చింది.

### 'సీరియస్ మోడీ' నుంచి 'క్యాజువల్ మోడీ' వరకు...

ప్రధాని మోడీ వ్యవహార శైలిలో కూడా మార్పు కనిపించింది. ఇన్నేండ్లు తనకు రాజకీయంగానూ, సామాజిక మాధ్యమాల్లో తిరుగు లేదని భావించిన మోడీకి తాజా పరిణామాలు రుచించడం లేదు. ఇన్నేండ్లు బీజేపీ ఐటీ సెల్‌తో విస్తృతంగా అవాస్తవాలను ప్రచారం చేస్తూ, ప్రత్యర్థులపై బురద జల్లుతూ లాభం పొందారు. ఓ విధంగా సీరియస్ ప్రధానిగా కనిపించారు.

- మిగతా 2లో..



## సంస్కరణలు పూర్తయ్యాయి.. ఇక 100 శాతం ఫలితాలే లక్ష్యం

- మంత్రి నారా లోకేశ్
- విజయనగరం దాసన్నపేటలో క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం
- హాజరైన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ప్రతినెలా క్లస్టర్ స్కూల్ సమావేశాలకు హాజరవుతానని మంత్రి హామీ
- ఈ ఏడాది మరో 3 వేల టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం
- నైతిక విలువల పెంపునకు ప్రత్యేక పాఠ్యాంశాలు రూపొందించామని వెల్లడి
- ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశంలోనే నంబర్ వన్ గా నిలుపుతామని ప్రకటన

**అమరావతి – సూర్య వాస్తవం :**
రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణల శకం పూర్తయిందని, ఇకపై నూరు శాతం ఫలితాలు సాధించడమే అందరి లక్ష్యం కావాలని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయనగరం దాసన్నపేటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ

- మిగతా 2లో..

## వెలిగొండ నిర్వాసితులకు
# రూ.250 కోట్ల పరిహారం..

- ఆగస్టు 31న ప్రాజెక్టు ప్రారంభం
- వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతగా రూ.250 కోట్ల పరిహారం పంపిణీ
- ఆగస్టు 31న ప్రాజెక్టు తొలిదశను ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- గత ప్రభుత్వం వల్లే ప్రాజెక్టు పూర్తి చేయడంలో జాప్యం జరిగిందన్న ముఖ్యమంత్రి
- ఐదు నదుల అనుసంధానంతో దేశంలో నీటి భద్రత సాధ్యమని వెల్లడి
- మార్కాపురంలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు సెప్టెంబర్‌లో శంకుస్థాపన



**అమరావతి – సూర్య వాస్తవం**
దశాబ్దాల నాటి వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా నిలుస్తూ కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. సీఎం

- మిగతా 2లో..



## విద్యా హబ్‌గా హైదరాబాద్..

- మాతో భాగస్వాములు కండి
- కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్– సూర్య వాస్తవం :**
అత్యున్నత విద్యా ప్రమాణాలను విద్యార్థులకు అందించేందుకు తెలంగాణ రాష్ట్రంతో కలిసి పనిచేయాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి లండన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందాన్ని కోరారు. దీనికోసం విద్యారంగంలో ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఒక్క రోజే.. 400 కేసుల పరిష్కారం



(మొదటిపేజీ తరువాయి)

పెండింగ్‌లో ఉన్న వివాదాలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవడానికి వీలు కల్పించడమే ఈ ప్రత్యేక లోక్ అదాలత్ లక్ష్యమని సుప్రీంకోర్టు వెల్లడించింది. సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన ఇద్దరు సిట్టింగ్ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, అడ్వొకేట్-ఆన్-రికార్డ్ (ఏూా=లు), ఇతర న్యాయవాదులతో కూడిన 16 ప్రత్యేక లోక్ అదాలత్ బెంచ్‌లు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నట్టు తెలిపింది. లోక్ అదాలత్‌లో మొదటి రోజు 600కు పైగా కేసులు పరిష్కారం కోసం లిస్ట్ కాగా.. వాటిలో 400కు పైగా కేసులను సామరస్యంగా పరిష్కరించినట్టు పేర్కొంది. వీటిలో వైవాహిక, ఆస్తి, వాహన ప్రమాద క్లెయిమ్‌లు, నష్టపరిహారం, కార్మిక వివాదాలు వంటివి ఉన్నాయి.

# వందేమాతర గీతంపై దేశవ్యాప్త ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

10 సూత్రాల తీర్మానాన్ని ఆమోదించింది. అనంతరం నితన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ విధానాలు సంకుచితమైన వని, అందుకే.. ఆ పార్టీ కేవలం రెండు చరణాల గీతం తమకు సమ్మతమని తీర్మానం చేసిందని దుయ్యబట్టారు. జాతీయ గీతం విషయంలో బీజేపీ రాజీపడబోదని స్పష్టం చేశారు. ఆరు చరణాల జాతీయ గీత వారసత్వాన్ని యావత్ దేశ ప్రజలకు తెలియజెప్పేం దుకు పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలను ఎండగడతామని, కొన్ని వర్గాలను బుజ్జగించేందుకు జాతీయ గీతాన్ని అగౌరవపరిచే విధానాలను తెలియజేస్తామని వ్యాఖ్యానించారు. వందేమాతర గీతం ఒక సామ్రాజ్య వాద వ్యతిరేక నినాదమని స్వయంగా మహాత్మాగాంధీ కొనియా డారని, కాంగ్రెస్ ఆ విషయాన్ని మరచిపోయిందని దేశ ప్రజలకు చాటిచెబుతామని స్పష్టం చేశారు.

**ప్రధాని మోదీకి ప్రియాంక్ ఖర్గే సవాల్**

వందేమాతర గీతంపై బీజేపీ జాతీయ కార్యవర్గం ఆమోదం తెలిపిన 10 సూత్రాల తీర్మానంపై కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందించారు. టెలీప్రాంప్టర్ లేకుండా ముందుగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరు చరణాల వందేమాతర గీతాన్ని ఆలపించాలని సవాల్ విసిరారు. ఆర్ఎస్ఎస్ నేతలకు ఇప్పుడు దేశభక్తిని నిరూపించుకోవాల్సిన సందర్భం వచ్చిందని, ఆర్ఎస్ఎస్ నేతలంతా ఎలాంటి ప్రాంప్టింగ్ లేకుండా జాతీయ గీతంలోని మొత్తం చరణాలు పాడాలని కర్ణాటక మంత్రి ప్రియాంక్‌ఖర్గే డిమాండ్ చేశారు.

# వెలిగొండ నిర్వాసితులకు రూ.250 కోట్ల పరిహారం..

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు నాయుడు మూడో విడత పునరావాస, పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ కింద రూ.250 కోట్ల చెక్కును నిర్వాసిత కుటుంబాలకు అందించారు. ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన చారిత్రక ప్రకటన చేశారు. దీంతో ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కల సాకారం కానుంది. ఇప్పటికే రెండు విడతల్లో పరిహారం అం దించిన ప్రభుత్వం, తాజాగా మూడో విడతలో 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు పంపిణీ చేసింది. దీంతో ఇప్పటివరకు మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల మేర పరిహారం అందినట్లయింది. ప్రాజెక్టుకు సంబంధించి ఆర్ అండ్ ఆర్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి నిర్వాసితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఈ చర్యలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. అసాధ్యమనుకున్న ప్రాజెక్టును సుసాధ్యం చేసి చూపిస్తున్నామన్నారు. "1996లో నేను శిలాఫలకం వేసిన ఈ ప్రాజెక్టును 2026లో ప్రారంభించుకోవడం నా అదృష్టం. గత రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేసి పనులను వేగవంతం చేశాం. ఎన్టీఆర్ ప్రారంభించిన అనేక ప్రాజెక్టులను పూర్తి చేసే అవకాశం నాకు దక్కింది" అని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో 50 శాతం లోటు వర్షపాతం ఉందని, శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీళ్లు రాని క్లిష్ట పరిస్థితుల్లోనూ వెలిగొండకు నీరివ్వాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని చంద్రబాబు వివరించారు. "2019లో మేం అధికారంలోకి వచ్చి ఉంటే 2021 నాటికే ఈ ప్రాజెక్టు పూర్తయ్యేది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, డ్రామాల వల్లే ఇంత జాప్యం జరిగింది" అని ఆయన విమర్శించారు. పోలవరం పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీరందించి, శ్రీశైలంలో నీటిని పొదుపు చేయడం ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతాలకు నీరివ్వవచ్చని సీఎం తెలిపారు. దేశంలో నీటి భద్రత సాధించేందుకు గంగా-గోదావరి-కావేరి నదుల అనుసంధానం చేయాలని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఈ ఐదు నదుల అనుసంధానంతో నాలుగు రాష్ట్రాల నీటి సమస్యలు తీరతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఉత్సాహంగా బ్రిక్స్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎం.రాంప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాండవీయ, సహాయమంత్రి రక్షానిఖిల్ ఖడ్సేలకు సీఎం జ్ఞాపికలు ఇచ్చి శాలువాలతో సత్కరించారు. ఆదివారం బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం జరగనుంది. దీనిలో భాగంగా ఉదయం బీచ్‌రోడ్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తారు. బ్రిక్స్ దేశాల మంత్రులు, ఉన్నతాధికారుల రాక నేపథ్యంలో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటుచేశారు.

# జెన్ జీ కోసం బీజేపీ తంటాలు

(మొదటిపేజీ తరువాయి)

అయితే ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ వంటి వాటి ఎఫెక్ట్‌తో ఆయన ఇప్పుడు ఒక క్యాజువల్ మోడీలా కనబడుతున్నారని విశ్లేషకులు చెప్తున్నారు. గెట్ రెడీ విత్ మీ తరహా రీల్స్, యువతను ఫ్రెండ్స్ అంటూ సంబోధించే సెల్ఫీ స్టైల్ వీడియోలు, జెన్ జీలో ప్రాచుర్యం పొందిన భాషను ఉపయోగించడం వంటివి ఆయన సోషల్‌మీడియా కమ్యూనికేషన్‌లో కొత్త ప్రయోగాలుగా కనిపిస్తున్నాయి. అయితే ప్రధానికి ఇన్‌స్టాగ్రామ్‌లో 106 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నప్పటికీ.. ఫాలోవర్ల సంఖ్య ఒక్కటే యువత రాజకీయ మద్దతును నిర్ధారించదని నిపుణులు చెప్తున్నారు.

**బీజేపీని ఇరుకున పెడుతున్న యువత నిరసనలు**

ఇటీవల దేశంలో జరిగిన యువత నిరసనలు బీజేపీ సోషల్‌మీడియా వ్యూహంపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. వ్యంగ్య ధోరణితో ప్రారంభమైన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఉద్యమం మీమ్స్, లైవ్‌స్ట్రీమ్స్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా విస్తరించింది. ఆన్‌లైన్ ట్రెండ్ అనేది నిరసనగా ఎలా మారుతుందో ఈ ఉద్యమం చూపిందని విశ్లేషకులు చెప్తున్నారు. యువత సోషల్‌మీడియా వినియోగాన్ని బీజేపీ ఇంతకాలం అనుసరించిన పద్ధతుల్లో పూర్తిగా అర్థం చేసుకోలేదా అన్న చర్చ కూడా మొదలైంది.

**మోడీ 'ఫ్రెండ్స్' వీడియోకు సెటైర్ల వెల్లువ**

'నీట్' విషయంలో యువత నిరసనల సమయంలో మోడీ చేసిన తొలి సెల్ఫీ-స్టైల్ వీడియోపై సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ముఖ్యంగా ఆయన 'ఫ్రెండ్స్' అని చెప్పిన తర్వాత వచ్చిన విరామాన్ని నెటిజన్లు వివిధ రకాల ఎడిట్స్, జోక్‌లతో వైరల్ చేశారు. మోడీ సందేశాన్ని ఆయన ఉద్దేశించిన విధంగా కాకుండా వ్యంగ్యంగా ప్రచారం జరగడం అనేది బీజేపీ పొలిటికల్ కమ్యూనికేషన్‌లో కీలక సమస్యను బయటపెట్టిందని విశ్లేషకులు చెప్తున్నారు.

**'ట్రెండ్స్ కాదు.. మా సమస్యలు వినండి'**

యువతను ఆకట్టుకోవాలంటే వారి భాషను, యాసను, రీల్స్ ఫార్మాట్‌ను అనుకరించడం మాత్రమే సరిపోదని నెటిజన్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేండ్లు వ్యవహరించిన తీరుకు భిన్నంగా మోడీ, బీజేపీలు చేస్తున్న రీల్స్‌ను ఒక రాజకీయ కోణంలోనే యువత చూస్తోందని అంటున్నారు. ఇలాంటి వీడియోల్లో మాత్రం యువత, విద్యార్థుల నిరసనలకు కారణమైన అసలు సమస్యలపై మాత్రం సమాధానాలు కనిపించడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

**'వాట్సాప్ మోడల్'కు 'ఇన్‌స్టా' భిన్నం**

మిచిగన్ విశ్వవిద్యాలయానికి చెందిన సోషల్‌మీడియా రాజకీయ వినియోగ నిపుణులు జోయోయాట్ పాల్ అభిప్రాయం ప్రకారం... వాట్సాప్, ఎక్స్‌లో ఉన్న మద్దతు దారుల నెట్‌వర్క్ ద్వారా ఒక సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం బీజేపీ బలంగా అలవర్చుకున్న వ్యూహం. కానీ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. అక్కడ ఒక చిన్న ఖాతా నుంచి వచ్చిన రీల్‌కు కూడా కోట్లాది వ్యూస్ రావచ్చు. అదే సమయంలో భారీ ఫాలోయింగ్ ఉన్న ఖాతా నుంచి వచ్చిన కంటెంట్ కొన్ని వేల వ్యూస్‌కే పరిమితం కావచ్చు. కాబట్టి ఇందులో ఫాలోవర్ల సంఖ్యతో సంబంధం ఉండదనీ, ప్రజలను ఎంతగా ఎంగేజ్ చేస్తున్నదే కీలకం.

**వైరల్ అయినంత మాత్రానా చాలదు...**

మోడీ తొలి ఇన్‌స్టాగ్రామ్ రీల్ వైరల్‌గా మారి 400 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించింది. యువతలో కొందరు దానిని తమదైన వ్యంగ్య శైలిలో ఎడిట్ చేసి పంచుకున్నారు. ఇది మోడీకి, బీజేపీకి ఇబ్బందిగా మారింది. కాబట్టి ఒక నాయకుడు పెట్టిన వీడియో ఎంతమందికి చేరిందన్నదే ముఖ్యం కాదనీ, అది చూసిన ప్రజలు దాన్ని ఏ అర్థంలో తీసుకున్నారు? అన్నదీ కీలకమని నిపుణులు చెప్తున్నారు.

**మంత్రులకు 'సోషల్‌మీడియా రిపోర్ట్‌కార్డు'**

యువతతో డిజిటల్ అనుసంధానం పెంచడంపై కేంద్ర మంత్రులకు కూడా 'అధిష్టానం' నుంచి సూచనలు వచ్చినట్టు తెలిసింది. నిరసనల సమయంలో మంత్రులు సోషల్‌మీడియా ఎంగేజ్‌మెంట్ పెంచుకోవాలని మోడీ సూచించినట్టు సమాచారం. అనంతరం మంత్రుల సోషల్ మీడియా పనితీరుపై రిపోర్ట్ కార్డు ఇచ్చి, వివిధ ప్లాట్‌ఫారమ్‌లలో మరింత చురుకుగా ఉండాలని సూచించినట్టు తెలిసింది. అదే సమయంలో 2015 నుంచి బీజేపీ సోషల్‌మీడియా విభాగానికి నాయకత్వం వహించిన అమిత్ మాలవీయ స్థానంలో మార్పు చోటుచేసుకోవడం కూడా చర్చకు దారితీసింది. నిరసనల సమయంలో బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడిన ఆన్‌లైన్ నెరేటీవ్‌ను పార్టీ సమర్థంగా ఎదుర్కోలేకపోయిందన్న విమర్శలు ఈ పరిణామంతో ముడిపడ్డాయని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు.

**కొత్త తరం.. కొత్త రాజకీయ భాష**

భారత జనాభాలో 60 శాతానికి పైగా 35 ఏండ్లలోపు వారేననీ, 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి జెన్ జీ కీలక ఓటర్లుగా ఎదుగుతారని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. ఈ కారణంతోనే రాజకీయ పార్టీలు వారిని చేరుకోవడంపై దృష్టి పెడుతున్నాయి. అయితే వారిని చేరుకోవడం కోసం రీల్స్ చేస్తే మాత్రమే సరిపోదనీ, వారి సమస్యలను అర్థం చేసుకొని, పరిష్కరించాలనీ, లేకపోతే కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి యువత నుంచి ఎదురైన చేదు అనుభవాలే కనిపిస్తాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

## సంస్కరణలు పూర్తయ్యాయి..

# ఇక 100 శాతం ఫలితాలే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రజాప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు పూర్తయ్యాయని, ఇప్పుడు పూర్తిగా అభ్యసన ఫలితాలపైనే దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. గత ఏడాది సంస్కరణల ఫలితంగా అద్భుతమైన ఫలితాలు వచ్చాయని, అయితే ఇది తొలిమెట్టు మాత్రమేనని లోకేశ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఫలితాలతో సంతృప్తిగా లేరని, నూరు శాతం ఫలితాలనే ఆశిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల క్షేత్రస్థాయి సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ఇకపై ప్రతినెలా ఒక క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరవుతానని హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో ఒత్తిడి లేని విధంగా వినూత్న పద్ధతుల్లో మెళకువలు నేర్పాలని సూచించారు.

యువగళం పాదయాత్ర సమయంలో కర్నూలు జిల్లాలో వలస కుటుంబాలను, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను చూసి చలించిపోయానని, అప్పుడే విద్యారంగంలో సంస్కరణలు తేవాలని నిర్ణయించుకున్నానని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. విద్యాశాఖ ఎంతో సవాలుతో కూడుకున్నదైనా, సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యమని తాను నమ్ముతానని పేర్కొన్నారు. విద్యామంత్రిగా బాధ్యతలు చేపట్టాక 10 వేల పాఠశాలల్లో 'వన్ క్లాస్ వన్ టీచర్' విధానం తెచ్చామని, డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని వివరించారు. ఈ ఏడాది మరో డీఎస్సీ ద్వారా అదనంగా 3 వేల పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'గా ప్రకటించడం, ఉత్తమ ఉపాధ్యాయులను శిక్షణ కోసం సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాలకు పంపడం వంటివి చేపట్టామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లల ఆలోచనా విధానం కూడా మారుతోందని, వారిని అర్థం చేసుకుని బోధనా పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ నేపథ్యంలో నైతిక విలువల ఆవశ్యకతను గుర్తించి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు గారి ద్వారా ప్రత్యేక పాఠ్యాంశాలు రూపొందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులపై బోధనేతర భారాన్ని పూర్తిగా తగ్గించామని, వారికి అండగా తాను ఉంటానని భరోసా ఇచ్చారు. రాబోయే ఐదేళ్లలో దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా అత్యుత్తమ విద్యావిధానాన్ని రూపొందించడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరక్టర్ బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# విద్యా హబ్‌గా హైదరాబాద్..




(మొదటిపేజీ తరువాయి)

విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో సమావేశం నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా సీఎం కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట, 'ఫ్రూగల్ ఏఐ' కో-చైర్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్ర మాలు నిర్వహించడం, సంయుక్తంగా పరిశోధనలు, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాల్లో భాగస్వామ్యానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొనేందుకు వారు అంగీకరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలనే 'తెలంగాణ రైజింగ్' లక్ష్యానికి ఈ సమావేశం మరింత బలం చేకూరుస్తున్నదని చెప్పారు.

**సీఎంతో లివర్‌పూల్ ప్రతినిధుల భేటీ**

లండన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డిని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ కు సంబంధించి తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఆసక్తి చూపారు. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేయడానికి లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శిస్తామని తెలిపింది.

**ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి**

లండన్‌లోని ప్రతిష్ఠాత్మక ఇంపీరియల్ కాలేజీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు సందర్శించారు. ఆ కాలేజీ అధ్యక్షుడి చీఫ్ ఆఫ్ స్టాఫ్, స్ట్రాటజిక్ ఎంగేజ్‌మెంట్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా, ఆస్ట్రేలేషియా ప్రాంతాల సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర విశిష్టత, విద్యారంగంలో ఉన్న అవకాశాలను వారికి వివరించి, కలిసి పని చేసేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు రావాలని ఆ కాలేజీ ప్రతినిధులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా అమాండా మాట్లాడుతూ తెలంగాణ, హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. పరిశోధనారంగంలో భాగస్వామ్యం, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి ఉందన్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ (స్టెమ్-ఎస్టీఈఎం), బిజినెస్ విద్యా రంగాల్లో ఇంపీరియల్ కాలేజీ ప్రపంచంలోనే ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అలాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థతో తెలంగాణ భాగస్వామ్య అవకాశాలపై చర్చలు జరగడం రాష్ట్రాన్ని అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలకు మరింత ఊతమిస్తుందని ఈ సందర్భంగా రామకృష్ణారావు తెలిపారు.

# మద్దిలేటి స్వామి ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే కోట్ల

**- ఏకగ్రీవంగా దేవాలయ కమిటీ చైర్మన్‌గా చైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్య**





**బేతంచర్ల – సూర్య వాస్తవం :** బేతంచర్ల మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామం లో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానంలో ధర్మకర్త మండలి సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన ధర్మకర్త మండలి సభ్యులను అభినందించి వారి బాధ్యతలు ఎంతో కీలకమైనవని తెలిపారు భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ దేవస్థానం అభివృద్ధి నిర్వహణ భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం దేవస్థాన ధర్మకర్త మండలి సభ్యులు సమావేశమై ఉన్నం ఎల్ల నాగయ్య ని ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్యకి ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి వారి ఆశీస్సులతో దేవస్థానం మరింత అభివృద్ధి చెందాలని భక్తులకు అన్ని విధాలుగా మెరుగైన సేవలు అందించేలా ధర్మకర్త మండలి పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త మండలి సభ్యులు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జొన్నగిరి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం...!

**- గుత్తి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఘటన**
**- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి.**
**- కేసు నమోదు చేసి .. దర్యాప్తు చేస్తున్న జొన్నగిరి పోలీసులు...**
**- రోడ్డు ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు**



**పత్తికొండ రూరల్ – సూర్య వాస్తవం :** కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి చెందారు. మద్దికేర మండలం మదనంతపురానికి చెందిన మహేంద్ర, బాలరాజు గుత్తిలోని ఓ గుజరిలో పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై గుత్తి నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. జొన్నగిరి వద్దకు చేరుకోగానే పత్తికొండ వైపు నుంచి వస్తున్న లారీ వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మహేంద్ర మృతి చెందాడు. తీవ్ర గాయాలతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన బాలరాజు శనివారం మృతి చెందాడు. ఘటనపై జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బాలికల భద్రతపై ఉపాధ్యాయులకు అవగాహన

**- పాక్సో, మహిళా రక్షణ, సైబర్ నేరాలపై నాయుడుపేటలో సదస్సు**
**- విద్యార్థినులకు సురక్షిత వాతావరణం కల్పించాలి**
**- అప్రమత్తంగా ఉండాలని సూచించిన సీఐ వెంకటేశ్వర్లు**

**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** విద్యార్థినుల భద్రత,రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నాయుడుపేట టౌన్ సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. నాయుడుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ప్రభుత్వ ఉపాధ్యాయులకు పోక్సో చట్టం, మహిళల రక్షణ,సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నాయుడుపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాలల్లో బాలికలతో వ్యవహరించే సమయంలో పాటించాల్సిన నిబంధనలు,వారి భద్రత కోసం తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను పోలీస్ అధికారులు వివరించారు.

**"పోక్సో చట్టంపై అవగాహన అవసరం"**

బాలికలపై లైంగిక వేధింపులు,దాడులను నిరోధించేందుకు అమల్లో ఉన్న పోక్సో చట్టంలోని ముఖ్యాంశాలను ఉపాధ్యాయులకు తెలియజేశారు. విద్యార్థినుల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంతో పాటు అనుమానాస్పద పరిణామాలను గుర్తించి తక్షణమే స్పందించాలని సూచించారు.

**"సైబర్ మోసాలపై అప్రమత్తత"**

సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, సందేశాలు, నకిలీ లింకులు,సోషల్ మీడియా ఖాతాల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందని ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని గుర్తుతెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. నాయుడుపేట మండల విద్యా శాఖాధికారి మాట్లాడుతూ పాఠశాలల్లో బాలికలకు అనుకూలమైన,భద్రమైన వాతావరణం ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థినులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే స్పందించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రధానో పాధ్యాయులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థినులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







- గురువు మందలిస్తే శత్రువా..?
- క్రమశిక్షణను ప్రతీకారంగా భావించే ప్రమాదకర ధోరణి.
- పిల్లలకు సౌకర్యాలు ఇస్తున్నాం.. సంస్కారం, విలువలు నేర్పుతున్నామా?
- మార్కుల వెంట పరుగులు.. మానవీయ విలువలను మరిచిపోతున్న సమాజం.
- కోపాన్ని చర్చగా మార్చాలే తప్ప... హింసగా కాదు..!
- గురువుకు గౌరవం.. విద్యార్థికి భద్రత.. తల్లిదండ్రులకు బాధ్యత ఉండాలి..

# గురువును దేవుడిగా భావించే సంస్కృతిలో
# నేడు గురువుపై దాడులెందుకు..?

**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం ప్రత్యేక కథనం :**

"గురుర్ బ్రహ్మ... గురుర్ విష్ణుః... గురుర్ దేవో మహేశ్వరః" అని గురువును దేవుడితో సమానంగా భావించిన సంస్కృతి మనది. తల్లిదండ్రుల తర్వాత పిల్లల జీవితాన్ని తీర్చిదిద్దే వ్యక్తిగా గురువుకు సమాజం అత్యున్నత గౌరవం ఇచ్చింది. కానీ నేడు పరిస్థితులు మారుతున్నాయి. గురువును గౌరవించాల్సిన విద్యార్థులే కొన్నిసార్లు దాడులకు పాల్పడుతున్నారు. మరోవైపు విద్యార్థులపై ఉపాధ్యాయుల దురుసు ప్రవర్తన, అవమానాలు లేదా హింసకు సంబంధించిన ఘటనలు కూడా సమాజాన్ని కలవరపెడుతున్నాయి.

అయితే అసలు ప్రశ్న ఒక్కటే గురువుకు ఉన్న గౌరవం ఎక్కడ తగ్గింది? విద్యార్థిలో సహనం ఎందుకు తగ్గింది? ఈ పరిస్థితికి అసలు లోపం ఎక్కడుంది? గురువు మందలిస్తే శత్రువా.? విద్యార్థి తప్పు చేస్తే మందలించడం, క్రమశిక్షణ నేర్పించడం, తప్పు మార్గంలో వెళ్తున్నప్పుడు అడ్డుకోవడం ఉపాధ్యాయుడి బాధ్యతలో భాగమే. కానీ నేటి పరిస్థితుల్లో కొన్ని సందర్భాల్లో మందలింపును అవమానంగా, క్రమశిక్షణను శత్రుత్వంగా, సరిదిద్దే ప్రయత్నాన్ని వ్యక్తిగత కక్షగా భావించే ధోరణి పెరుగుతోంది. గురువు చెప్పిన మాట నచ్చులేదంటే చర్చించవచ్చు. తల్లిదండ్రులను సంప్రదించవచ్చు. పాఠశాల యాజమాన్యాన్ని ఆశ్రయించవచ్చు. అవసరమైతే చట్టపరమైన మార్గాన్ని కూడా ఎంచుకోవచ్చు. కానీ దాడి మాత్రం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. ఇటీవల నల్గొండ జిల్లాలో పాఠశాల ప్రిన్సిపాల్ హత్యకు సంబంధించిన ఘటనలో మైనర్లపై వచ్చిన ఆరోపణలు సమాజాన్ని తీవ్రంగా కలచివేశాయి. పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు వార్తల్లో వచ్చిన వివరాలు నిజమైతే, ఇది ఒక నేర ఘటనకే పరిమితం కాని, పిల్లల ఆలోచనా విధానం, కుటుంబ పర్యవేక్షణ, స్నేహాల ప్రభావం, డబ్బుపై ఆకర్షణ, కోప నియంత్రణ వంటి అనేక అంశాలను ప్రశ్నించే ఘటన. ఒక గురువు ప్రాణం కోల్పోయిన తర్వాత చర్చించడం కంటే, ఇలాంటి ఆలోచనలు పిల్లలలో ఏర్పడకముందే గుర్తించడం ముఖ్యం.

**పిల్లలకు సౌకర్యాలు ఇస్తున్నాం.. విలువలు ఇస్తున్నామా?**

తల్లిదండ్రులు పిల్లలకు మంచి పాఠశాలలు, ఖరీదైన ఫోన్లు, వాహనాలు, పాకెట్ మనీ, కావాల్సిన వస్తువులు అందిస్తున్నారు. కానీ ఒకసారి మనల్ని మనమే ప్రశ్నించుకోవాలి--- మంచి--చెడుల మధ్య తేడా నేర్పుతున్నామా? ఓటమిని ఎలా స్వీకరించాలో చెబుతున్నామా? కోపాన్ని ఎలా నియంత్రించాలో నేర్పుతున్నామా? డబ్బు విలువ, కష్టపడి సంపాదించడం, ఇతరులను గౌరవించడం గురించి మాట్లాడుతున్నామా? పిల్లవాడు ఎన్ని మార్కులు సాధించాడు అనేది ఎంత ముఖ్యమో, అతను ఎలాంటి మనిషిగా ఎదుగుతున్నాడనేది అంతకంటే ముఖ్యం.

**ప్రేమ పేరుతో తప్పును దాచడం ప్రమాదం**

పిల్ల తప్పు చేస్తే దాన్ని కప్పిపుచ్చడం ప్రేమ కాదు. తప్పును అర్థం చేయించి, సరిదిద్దే అవకాశం ఇవ్వడమే నిజమైన ప్రేమ. యుక్తవయస్సులో పిల్లల ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు వస్తే తల్లిదండ్రులు వాటిని ప్రేమతో గమనించాలి. కొత్త స్నేహాలు, అసాధారణ ఖర్చులు, అబద్ధాలు, కోపం, చదువుపై ఆసక్తి తగ్గడం, ఆన్‌లైన్ కార్యకలాపాల్లో అనుమానాస్పద మార్పులు వంటి విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయకూడదు. అయితే పిల్లలపై నిఘా పెట్టడం కాదు; వారితో మాట్లాడటం, వినటం, అర్థం చేసుకోవడం ముఖ్యం.

**ప్రతి తప్పుకూ మొబైల్‌నే కారణం అనడం కూడా సరికాదు**

పిల్లల ప్రవర్తనలో మార్పుకు మొబైల్, సినిమా, సోషల్ మీడియానే కారణమని చెప్పడం సరళీకరణ అవుతుంది. కుటుంబ వాతావరణం, స్నేహాలు, పాఠశాల అనుభవాలు, వ్యక్తిగత సమస్యలు, సామాజిక ఒత్తిళ్లు వంటి అనేక అంశాలు ప్రభావం చూపవచ్చు. అయితే హింసను సాధారణీకరించే కంటెంట్, తక్షణ ధనార్జనపై మోజు, విలాసవంతమైన జీవితం పట్ల ఆకర్షణ వంటి ప్రభావాలను కూడా పూర్తిగా విస్మరించలేం. అందుకే ఇంట్లో డిజిటల్ క్రమశిక్షణతో పాటు భావోద్వేగ సంభాషణ కూడా అవసరం.

**గురువులకూ బాధ్యత ఉంది**

గురువును గౌరవించాలి అంటే ఉపాధ్యాయుడికి ప్రశ్నించలేని అధికారం ఇవ్వాలని కాదు. విద్యార్థులను కొట్టడం, అవమానించడం, భయపెట్టడం, వ్యక్తిగతంగా కించపరచడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదు. గురువు గౌరవం ఆయన పదవిలో మాత్రమే కాదు– ఆయన ప్రవర్తనలోనూ ఉంటుంది. విద్యార్థి భద్రత ఎంత ముఖ్యమో, ఉపాధ్యాయుడి గౌరవం, భద్రత కూడా అంతే ముఖ్యం.

**పాఠశాల యాజమాన్యం ఎక్కడ?**

విద్యార్థి--తల్లిదండ్రులు--ఉపాధ్యాయులు--యాజమాన్యం మధ్య సమస్యలను ముందుగానే పరిష్కరించే వ్యవస్థ బలంగా ఉంటే అనేక చిన్న వివాదాలు పెద్ద ఘర్షణలుగా మారకుండా అడ్డుకోవచ్చు. పాఠశాలల్లో మార్కులు, ర్యాంకులతో పాటు,విలువల విద్య,కోప నియంత్రణ, కౌన్సెలింగ్,సైబర్ బాధ్యత,వ్యసనాల నివారణ,చట్టాలపై ప్రాథమిక అవగాహన. సమస్యలను హింస లేకుండా పరిష్కరించే నైపుణ్యాలు వంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రమాదకరమైన ప్రవర్తనను ప్రారంభ దశలోనే గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కౌన్సెలర్లు కలిసి స్పందించే వ్యవస్థ అవసరం.

**అసలు లోపం ఎక్కడుంది?**

ఈ ప్రశ్నకు ఒకే వ్యక్తిని నిందిస్తూ సమాధానం చెప్పలేం. గురువు--విద్యార్థి మధ్య గౌరవ సంబంధం బలహీనపడుతోంది. తల్లిదండ్రులు కొన్నిసార్లు పిల్లల తప్పులను సమర్థించే స్థాయికి వెళ్తున్నారు.కొంతమంది ఉపాధ్యాయులు తమ బాధ్యతలో అవసరమైన సంయమనాన్ని కోల్పోతున్నారు. పాఠశాలల్లో సంభాషణ, కౌన్సెలింగ్ వ్యవస్థలు తగినంతగా బలంగా లేవు. సమాజంలో కోపాన్ని చర్చగా కాకుండా దూకుడుగా వ్యక్తం చేసే ధోరణి పెరుగుతోంది. ఇవన్నీ కలిసే సమస్యను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి.

**పరిష్కారం ఏమిటి?**

పరిష్కారం "గురువుకే మొత్తం అధికారం" కాదు. అలాగే "విద్యార్థికే మొత్తం స్వేచ్ఛ" కూడా కాదు. అవసరమైనది.

గురువుకు గౌరవం ం విద్యార్థికి భద్రత ం తల్లిదండ్రులకు బాధ్యత యాజమాన్యానికి జవాబుదారీతనం.

ఈ నాలుగు సమతుల్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన విద్యా వ్యవస్థ నిర్మాణమవుతుంది.

గురువును కాపాడటం అంటే తప్పు చేసిన గురువును సమర్థించడం కాదు.

విద్యార్థిని కాపాడటం అంటే గురువును అవమానించడం కాదు.

తల్లిదండ్రుల ప్రేమ అంటే పిల్లల ప్రతి తప్పును సమర్థించడం కాదు.

విద్యాసంస్థ బాధ్యత అంటే కేవలం ఫీజులు వసూలు చేసి పరీక్షలు నిర్వహించడం కాదు.

గురువు చేతిలో పుస్తకం ఉండాలి.. భయం కాదు

విద్యార్థి మనసులో జ్ఞానం ఉండాలి.. ప్రతీకారం కాదు.

తల్లిదండ్రుల హృదయంలో ప్రేమ ఉండాలి.. కానీ ఆ ప్రేమకు బాధ్యత కూడా తోడుండాలి.

విద్య అంటే కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడం కాదు. ఉద్యోగం పొందడం మాత్రమే కాదు. డాక్టర్లు, ఇంజనీర్లు, అధికారులు, వ్యాపారవేత్తలను తయారు చేయడం మాత్రమే కాదు. ముందుగా మంచి మనుషులను తయారు చేయడమే విద్య యొక్క అసలు లక్ష్యం. ఒకప్పుడు "ఆచార్యదేవో భవ" అని గురువుకు అత్యున్నత స్థానం ఇచ్చిన సమాజం, నేడు గురువుపైనే దాడి జరిగే పరిస్థితికి ఎందుకు చేరిందో ఆత్మపరిశీలన చేసుకోవాలి. అదే సమయంలో గురువు కూడా తన వృత్తి గౌరవాన్ని తన ప్రవర్తనతో కాపాడుకోవాలి.

తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులు ఇవ్వడం కంటే విలువలు ఇవ్వాలి.

సౌకర్యాలు ఇవ్వడం కంటే సంస్కారం ఇవ్వాలి.

చదువు చెప్పించడం కంటే మంచి మనిషిగా జీవించడం నేర్పాలి.

ఒక ఉపాధ్యాయురాలి ప్రాణం పోయిన తర్వాత మాత్రమే మనం మేల్కొంటే అది మరో విషాదానికి దారి తీస్తుంది. గురువును గౌరవించే సమాజమే జ్ఞానవంతమైన సమాజం. విద్యార్థి భద్రతను కాపాడే సమాజమే నాగరిక సమాజం. ఇద్దరినీ కాపాడే విద్యా వ్యవస్థే నిజమైన విద్యా వ్యవస్థ.

**అందుకే ఇప్పుడు ప్రశ్న---**

"గురువును ఎలా కాపాడాలి?" అన్నదొక్కటే కాదు. "విద్యార్థిని కూడా ఎలా మంచి మనిషిగా తీర్చిదిద్దాలి?" అన్నదీ కావాలి. అసలు లోపం ఒక్క గురువులో లేదు. ఒక్క విద్యార్థిలో లేదు. కుటుంబం, పాఠశాల, సమాజం, ప్రభుత్వ వ్యవస్థ---అన్నీ కలిసి తమ బాధ్యతను తిరిగి గుర్తించాల్సిన సమయం ఇది. ఇలాంటి విషాదం మరోసారి జరగకూడదంటే, మన పిల్లలకు భవిష్యత్తు మాత్రమే కాదు---విలువలతో కూడిన వర్తమానం కూడా ఇవ్వాలి.

# ప్యాపిలిలో ముగిసిన బీఆర్సీ శిక్షణ

**- ప్రకృతి వ్యవసాయ విస్తరణలో పాయింట్ పర్సన్ల పాత్ర కీలకం**

**ప్యాపిలి – సూర్య వాస్తవం :** ప్యాపిలిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడంలో పాయింట్ పర్సన్ల పాత్ర ఎంతో కీలకమని ప్యాపిలి మండల మాస్టర్ ట్రైనర్ చిన్న పుల్లయ్య, మండల నోడల్ బిఆర్సి ఓనర్ సుధాకర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో గత రెండు రోజు లుగా జరుగుతున్న 2వ బ్యాచ్ విఓ స్థాయి బిఆర్సి పాయింట్ పర్సన్ల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శనివారంతో విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణలో పెద్దపోదిళ్ల, పోతుదొడ్డి, మెట్టుపల్లి, జలదుర్గం, గార్లదిన్నె క్లస్టర్ల పరిధిలోని పాయింట్ పర్సన్లకు వారి విధులు, బాధ్యతలను సమగ్రంగా వివరించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థ వంతంగా తట్టుకునేందుకు ఎల్ నినో ప్రభావం, పిఎండిఎస్ విధానం, ఏ-గ్రేడ్ ఏటిఎం మోడళ్ల ప్రాముఖ్యతపై దిశానిర్దేశం చేశారు. ముగింపు సెషన్‌లో భాగంగా పంటల ఎదుగుదలకు, గ్రోత్ ప్రమోటర్లైన కోడి గుడ్డు నిమ్మరసం, పేడఇంగువ మూత్రం ద్రావణాల తయారీ విధానం మరియు వాటి పనితీరుపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటి చిన్న పుల్లయ్య, రిసోర్స్ పర్సన్లు సుధాకర్, వేణుగోపాల్, సూర్యనారాయణ, మనోహర్, సిబ్బంది, వివిధ క్లస్టర్ల పాయింట్ పర్సన్లు పాల్గొన్నారు.



## చిన్న వయసులోనే వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలి...!

**- పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన.**
**- రాజేంద్ర మున్సిపల్ స్కూల్లో 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర'**






**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** చిన్న వయసు నుంచే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. రాజేంద్ర మున్సిపల్ స్కూల్లో నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంట్లో కానీ, పాఠశాలలో కానీ చెత్తను చెత్తబుట్టల్లోనే వేయాలని సూచించారు. మన ఇల్లు, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇంటి వద్ద, పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకుని, తమ తల్లిదండ్రులకు కూడా పరిశుభ్రత ప్రాధాన్యతను తెలియజేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## 45 రోజులుగా తాగునీటి కోసం గ్రామస్థుల అవస్థలు

**- ఐదు బోర్లలో మూడు మాత్రమే పనిచేస్తున్న వైనం.**
**- ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన**
**- వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి ధనుంజయ గ్రామస్తులు...**



**కూడేరు – సూర్య వాస్తవం :** కూడేరు మండలం ఇప్పేరు పంచాయతీ పరిధిలోని పి. నాగిరెడ్డిపల్లి గ్రామంలో గత 45 రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో మొత్తం ఐదు బోర్లు ఉండగా, ప్రస్తుతం మూడు బోర్లలో మాత్రమే అరకొరగా నీరు వస్తోంది. దీంతో దిగువ ప్రాంతంలోని ఇళ్లకు మాత్రమే నీరు అందుతుండగా, ఎగువ ప్రాంతంలోని కుటుంబాలకు చుక్క నీరు కూడా అందడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం గ్రామస్థులు పొలాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తక్షణమే రెండు బోర్లలోని మోటార్లను మరమ్మతు చేస్తే మరికొన్ని కుటుంబాల నీటి అవసరాలను కొంతవరకు తీర్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కూడేరు మండల ఎంపీడీవోను గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ధనుంజయతో పాటు గ్రామ ప్రజలు పాల్గొని ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.

## ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్టాపనకు రూ. 60 వేల విరాళం

**పామిడి – సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణపరిధిలోని 3వార్డు నందు వెంగమనాయుడు కాలనీ నందు నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా దేవాలయమునకు ధ్వజ స్తంభశీ లేనందున కాలనీవాసులు అందరూ కలిసి ఆలయ ధ్వజస్తంభం ఇవ్వాలని వైయు రామాంజనేయులును కోరగా అడిగిన వెంటనే స్పందించి తనవంతుగా భావించి ఆలయనిర్మాణం పనుల్లో భాగంగా ఆయన చిరస్మరనీయమైన ధ్వజస్తంభం నిర్మాణమునకు మంచి మనసుతో 7వ వార్డు మాజీ కౌన్సిలర్ వై,యు, రామాంజనేయులు రూ.60 వేలను విరాళం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి తండ్రి గురువు దైవం లేనిది మానవుని మనుగడ లేదని,నాకు తల్లి తండ్రి గురువు ఈ ముగ్గురు గతించడంగతించారని, ఉన్నదల్లా ఆదైవం ఒక్కటేనని, దైవ సేవలో భాగంగా నీలూరు గ్రామంలోని ఆంజనేయస్వామికి వజ్రకవచం, పొగూరు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి ధ్వజస్తంభం, పామిడినాగిరెడ్డి కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయానికి ధ్వజస్తంభం,పామిడిఅయ్యప్ప స్వామి ఆలయంలో నవగ్రహాలు, సుబ్రమణ్యస్వామి, వినాయకుడు, మాలికప్రతమ్మ, విగ్రహాలను నిర్మించానని, దైవకార్యక్రమాలలో తలవంత తోడ్పాటు అందించానన్నారు. గతంలో కౌన్సిలర్ గా ఉన్న కాలంలో అభివృద్ధి కోసం ప్రభుత్వ నిధులతో పాటు నా సొంతంగా దాదాపు పది లక్షల వరకు ఖర్చు పెట్టాలని వాటిని మానవ సేవగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ కన్వీనర్ జింకలరామకృష్ణ, మేజర్ లక్ష్మీనారాయణ,బిజెపి మండల అధ్యక్షుడు అంజి నాయక్, జనసేన పార్టీ వడ్డే రాము,సూరి,మాధవయ్య,మస్తాను, యుగంధర్, దూదా, రాజశేఖర్, రామాంజనేయులు, లారీఓబులేసు, బాబా, దొడ్డమ్మ, నారాయణమ్మ, తులసమ్మ, ఫక్రుణ్ణి, లక్ష్మి, లావణ్య, నిర్మల తదిత కాలనీవాసులు భక్తాదులు పాల్గొన్నారు. కాలనీ వాసులు ప్రత్యేకంగా ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.





# అనంతపురం జిల్లాను తొలి ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు..

**- 'స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర'లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్...!**
**- వినూత్న పద్ధతిలో క్యూఆర్ కోడ్‌తో చెత్త సేకరణ..**
**- ఆదర్శ గ్రామంగా కాట్నే కాలువను తీర్చిదిద్దాలని డిస్కవర్ అనిల్ కుమార్ సూచన...!**




**అనంతపురం కార్పొరేషన్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలోని కాట్నే కాలువ గ్రామంలో శనివారం ఉదయం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో క్యూఆర్ కోడ్ విధానం ద్వారా ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సభలో కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. కర్ణాటకలోని ఓ గ్రామంలో క్యూఆర్ కోడ్ ద్వారా చెత్త సేకరణ విధానాన్ని సోషల్ మీడియాలో చూసి, ఈ విధానం సమర్థ వంతంగా ఉందని భావించినట్లు తెలిపారు. అదే విధానాన్ని జిల్లాలో అమలు చేసేందుకు కొంతమంది అధికారులను కర్ణాటకకు పంపి పూర్తి వివరాలు తెలుసు కున్నామని చెప్పారు. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా కాట్నే కాలువలో క్యూఆర్ కోడ్ ఆధారిత చెత్త సేకరణ విధానాన్ని ప్రారంభించినట్లు వివరించారు. డిస్కవర్ అనిల్‌కుమార్‌తో కలిసి కాట్నే కాలువ ను అనంతపురం జిల్లాలో తొలి ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులకు క్లాత్ సంచులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ విధానం, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసు కున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. డిస్కవర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా కాటిగాని కాలువను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు.



# గుత్తిలో వైసీపీ ఆత్మీయ సమావేశం

**- భారీగా తరలి వచ్చిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు**



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ర్వహించిన ఆ త్మీయ సమా వేశానికి వైఎస్సార్‌సీపీ గుంతకల్లు నియోజకవర్గ మాజీ శా సన సభ్యులు,ఇంచార్జ్ వై.వెంకటరా మిరెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సమావేశానికి గుత్తి ప ట్టణ,మండలానికి చెందిన పార్టీ నా యకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివ చ్చారు. ఈ సంద ర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి వై. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కూ టమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వ వైఫల్యాలు,అ రాచకాలు, దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని అ న్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో వై ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రతి స్థానం లోనూ బలమైన అభ్యర్థుల ను బరిలోకి దింపుతామని, ప్రజల ఆ శీస్సులతో ప్రతి స్థానంలో వైఎస్సా ర్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుం టామని ధీమా వ్యక్తం చేశారు. కార్య కర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతంచేయా లని పిలుపునిచ్చారు. గుత్తి పట్టణం లో నెలకొన్న తీవ్ర నీటి సమస్యపై ఆ యన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందు లు పడుతున్నా కూటమి ప్రభుత్వం సమస్యకు శాశ్వత పరిష్కారం చూ పడంలో విఫలమైందని విమర్శించా రు. తమ ప్రభుత్వహయాంలో గుత్తి పట్టణ ప్రజలకు నీటి సమస్య లేకుం డా చేసేందుకు దాదాపు 70 శాతం పనులను పూర్తి చేసేలా చర్యలు చే పట్టామని తెలిపారు. అలాగే,సరైన సమ యంలో వర్షాలు కురవకపో వ డంతో రైతులు పంటలు నష్టపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని అన్నారు. రైతుల సమస్యలను ప్ర భుత్వం తక్షణమే గుర్తించి ఆదు కోవాలని డిమాండ్ చేశారు. రైతుల కు అండగా నిలబడాల్సిన ప్రభు త్వం వారి సమస్యలను నిర్లక్ష్యం చే యడం సరికాదన్నారు. ప్రజా సమ స్యలపై వైఎస్సార్‌సీపీ నిరంతరం పో రాడుతుందని,ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుండి అండగా ని లబడాలని సూచించారు. వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలం ప్రజలే వెన్ను దన్ను రాబోయే రోజుల్లో గుత్తి గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడే లా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని వై.వెంకటరామి రెడ్డి పి లుపునిచ్చారు. ఈ స మావేశంలో గుత్తి పట్టణ,మండల వైఎస్సార్‌సీపీ నా యకులు,కార్యకర్తలు,అభిమా నులు భారీ సంఖ్యలో పాల్గొని స మావేశాన్ని విజ యవంతం చేశారు.

# రక్తదానం, నేత్రదానం ద్వారా చిరంజీవి అందిస్తున్న సేవలు అభినందనీయం

**- మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని పెన్నాహోబిలంలో ప్రత్యేక పూజలు...!**
**- చిరంజీవి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించిన జనసేన నాయకులు**



**ఉరవకొండ రూరల్ – సూర్య వాస్తవం :** వెండితెరపై తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరించడంతో పాటు, సేవా స్ఫూర్తితో ఎంతోమందికి అండగా నిలిచిన పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని ఉరవకొండ జనసేన నాయకులు పెన్నాహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా చిరంజీవి ఆయురా రోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. జనసేన నాయకులు చంద్రశేఖర్, రాజేష్, పెన్నాహోబిలం ఆలయ కమిటీ సభ్యుడు దేవేంద్రతో పాటు పలువురు నాయకులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ.. చిరంజీవి తన అభిమానులను సేవా కార్యక్రమాల వైపు నడిపించి రక్తదానం, నేత్రదానం వంటి కార్యక్రమాల ద్వారా ఎంతోమందికి అండగా నిలిచారని తెలిపారు. రక్తం అందక ఇబ్బందులు పడుతున్న ఎంతోమంది ప్రాణాలను రక్తదానం ద్వారా కాపాడటంతో పాటు, నేత్రదానం ద్వారా చూపు కోల్పోయిన వారికి కొత్త వెలుగును అందించేలా స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ బ్యాంకులు ఏర్పాటు చేసి అవసరమైన వారికి ఆక్సిజన్ అందించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. సినీ పరిశ్రమలో పేద కళాకారులకు, ఆపదలో సహాయం కోరిన వారికి అండగా నిలుస్తూ చిరంజీవి మానవత్వాన్ని చాటుకున్నారని అన్నారు. అలాగే సినీ రంగంలో ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహిస్తూ, వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించే అపద్బాంధవుడిగా చిరంజీవి నిలిచారని

# రేపు కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా

- దళితులు పాల్గొని జయప్రదం చేయాలి ఎం. మల్లేష్
- మండల వ్యాప్తంగా దళిత సోదర సోదరీమణులు
- ధర్నాలో పాల్గొనాలని బైక్ ర్యాలీ



**పామిడి – సూర్య వాస్తవం :** సిపిఎం పార్టీ అనుబంధ సంస్థ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి శ్రీనివాసులు, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పామిడి మండలంలోని వంక రాజుకాలువ. కండ్లపల్లి. ఎద్దులపల్లి. పాళ్యం. కత్తిరిమల గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించి కాలనీలలో సమస్యలను పరిష్కరించాలని వివిధ రూపాలలో అధికారులకు అర్జీలు ఇచ్చి ఆందోళన చేస్తున్నా దళితుల సమస్యలను ఏమాత్రం పరిష్కరించడం లేదని,కావున అధికారులు ప్రభుత్వము ప్రజాప్రతినిధులు మన దళితవాడలోకి కదిలి వచ్చి మన సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాలు కొనసాగించవలసిన అవసరం ఉందని, అందులో భాగంగా ఈనెల 24న అనంత పురం కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా కార్యక్రమాన్ని కెవిపిఎస్ .వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. ఈ ధర్నాకు మండలంలోని దళిత సోదర సోదరీమణులు అందరూ రావాలని సామాజిక శంఖారావం మిమ్మల్ని కోరుతూ పిలుపునిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ముత్యాలు, చాసు, సాయి, రజక సంఘం నాయకులు రాము, తదితరులుపాల్గొన్నారు.

# కొత్త ఓటరు నమోదు ప్రారంభం

- తహశీల్దార్ షర్మిల



**పామిడి – సూర్య వాస్తవం:** అక్టోబర్ 01-2008 లేదా అంతకుముందు జన్మించిన వారు కొత్తగా ఓటర్ నమోదు చేసుకోవచ్చని మండల తహసిల్దార్ షర్మిల పత్రికా ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇందుకు కావాల్సిన పత్రములు 1.ఆధార్ కార్డు, 2.జనన ధృవీకరణ పత్రం లేదా 10వ తరగతి మార్క్ లిస్ట్, లేదా టిసి,3. 2 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు,4. కుటుంబసభ్యుల్లో ఒకరి ఓటర్ ఐడీ కార్డు జిరాక్ 5. మొబైల్ నంబరు, వున్నవారు. దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 1. గ్రామ / వార్డు సచి వాలయంలోగాని, 2. మీ సేవ కేంద్రంలో గాని, 3ఎన్ విఎస్‌పి పోర్టల్ లలోగాని నమోదు చేసుకోవా లన్నారు. మీఓటు - మీ హక్కు ఓటరుగా నమోదు అవ్వాలన్నారు.

# నాలుగు ఆలయాల హనుమాన్ క్షేత్ర దర్శనం యాత్ర



**పామిడి – సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలో శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా ఒకరోజు హనుమాన్ క్షేత్ర దర్శన యాత్ర నిర్వహించారు. పట్టణంలోని కోట ఆంజనేయ స్వామి, తగ్గు దేవాలయ ఆంజనేయ స్వామి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాలలో ఘనంగా అభిషేకాలు అర్చనలు పూజలు నిర్వహించారు. తిరుమల భజన మండలి వారిచే హనుమాన్ ఉత్సవ విగ్రహాలను పామిడి పురవీధులలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆయా దేవాలయాల్లో యధాస్థానంలో చేర్చి గర్భగుడిలలో కొలువు తీర్చారు. ఈ కార్యక్రమాలు జోజోడేకుమార్, ఆయా దేవాలయాల కమిటీసభ్యులు, భజన బృందాల ఆధ్వర్యంలో నిర్వహించారు అనంతరం భక్తాదులందరికి ప్రజలకి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# వాసవి మాత ప్రధమ వార్షికోత్సవ వేడుకలు

**గార్లదిన్నె – సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన గార్లదిన్నెలోని ఆర్యవైశ్య కుల స్తుల ఆరాధ్య దైవం అయిన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ట ప్రధమ వార్షికోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మ వారికి పలు అభిషేకాలు అర్చనలు మహిళలచే కుంకుమార్చనలు, పుష్పార్చనలు చేశారు. అనంతరం గణపతి నవ గ్రహ వాసవి హోమాలు వేదమంత్రాలు మధ్య పురోహి తులు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలతో పాటు వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన నిర్వహించారు.





# హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్ట్...!

- సీఐ ఆదేశాలతో నిందితులను అరెస్ట్ చేసిన ఎస్ఐ శరత్ చంద్ర



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని సోమనాథ్ నగర్ మైన్ రోడ్డులో జరిగిన హత్యాయత్నం ఘటనకు సంబంధించి నలుగురు నిందితులను అనంతపురం త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 20వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో సోమనాథ్ నగర్ మైన్ రోడ్డులోని అంకిత్ చికెన్ సెంటర్ వద్దకు నలుగురు వ్యక్తులు వచ్చి అక్కడ మూత్రవిసర్జన చేస్తుండగా, చికెన్ షాపులో పనిచేస్తున్న పవన్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో నిందితులు పవన్ కుమార్‌తో పాటు షాపు నిర్వాహకుడు పడమల రమేష్‌పై రాళ్లు, కట్టెలతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనలో పవన్ కుమార్ తలకు గాయాలు కావడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రమేష్ చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యాడు. రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనంతపురం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో గుజ్జల దామోదర్ (29), పప్పక హరికృష్ణ (27), మంచాల హేమంత్ రాజ్ (25), బండి మేకల కార్తీక్ (25)లను పోలీసులు నిందితులుగా గుర్తించారు. అనంతపురం టౌన్ ఇన్‌స్పెక్టర్ జి. కౌలుట్లయ్య ఆదేశాల మేరకు త్రీటౌన్ ఎస్ఐ ఎ. శరత్ చంద్ర తన సిబ్బందితో కలిసి శనివారం మధ్యాహ్నం సుమారు 1 గంట సమయంలో అనంతపురం పాత ఆర్టీసీ బస్‌స్టాండ్ వెనుక నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# హెచ్ఎల్సీ, హెచ్ఎన్ఎస్ కాలువల నీరు తాగునీటికే...!

- వర్షాభావం నేపథ్యంలో అధికారుల కీలక నిర్ణయం..
- నీటి ఆధారిత పంటలు వేయొద్దని రైతులకు సూచన



**ఉరవకొండ టౌన్ – సూర్య వాస్తవం:** రిజర్వాయర్లలో నీటి మట్టాలు అడుగంటడం, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ ఏడాది తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ఎల్సీ), హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్) కాలువల ద్వారా వచ్చే నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకే వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ అరుణ, ఎంపీడీవో రవి ప్రసాద్, ఉరవకొండ వ్యవసాయ సబ్‌డివిజన్ సహాయ సంచాలకులు సత్యనారాయణ, హంద్రీనీవా ఏఈ రాఘవేంద్ర మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామా ల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అందుబాటులో ఉన్న అన్ని మంచినీటి వనరులను వినియోగంలోకి తీసు కువచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాలువల నీటిపై ఆధారపడి పంటలు సాగు చేయవద్దని జిల్లా అధికారులు ఇప్పటికే రైతులకు సూచనలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

**ఆరుతడి పంటల వైపు మళ్లాలి**

రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని అధికారులు సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉరవకొండ వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది', 'రైతన్నా మీ కోసం' వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే రెవెన్యూ, హెచ్ఎల్సీ, హంద్రీనీవా అధికారులు గ్రామాల్లో టాంటాం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారని చెప్పారు.

**నీటి పంటలతో నష్టపోయే ప్రమాదం**

కొంతమంది రైతులు మిరప, వరి వంటి నీటి ఆధారిత పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారని అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే నీటి లభ్యతపై ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్ఎల్సీ, హంద్రీనీవా కాలువల ద్వారా వచ్చే నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించేలా రైతులు సహకరించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకే పంటలు సాగు చేయాలని సూచించారు. అధికారుల సూచనలను పట్టించుకోకుండా నీటి ఆధారిత పంటలు సాగు చేస్తే రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు రైతులు, ప్రజలు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఎరువుల విక్రయ కేంద్రం ప్రారంభం...!

- రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు



**ఉరవకొండ టౌన్ – సూర్య వాస్తవం :** రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకు రావడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ ప్యారం కేశవానంద అన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసుల సహకారంతో ఉరవకొండ సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్యారం కేశవానంద మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా, అందుబాటు ధరల్లో ఎరువులు లభించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతులకు నేరుగా అవసరమైన ఎరువులు అందించాలనే ఉద్దేశంతో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం విక్రయ కేంద్రంలో 50 కిలోల డీఏపీ బస్తా రూ.1,350కు, 50 కిలోల యూరియా బస్తా రూ.266కు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సహకార బ్యాంకు ద్వారా ఎరువులు పొందాలని కోరారు. రైతులకు ఎరువులు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి పట్ల రైతుల్లో సానుకూల స్పందన ఉందన్నారు. ముఖ్యంగా మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో రైతులకు మరింత ప్రయో జనం చేకూరేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంకు డైరెక్టర్లు నాగేంద్రప్ప, నాగ ప్రమీల, సహకార బ్యాంకు కార్యదర్శి మహమ్మద్ గౌస్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజనేయులు, టీడీపీ నాయకులు రామాంజనేయులు, సుంకన్న, పెద్దన్న, గోవిందు, సహకార బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'స్వచ్ఛ ఆంధ్ర'

- పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించిన అధ్యాపకులు
- జాతీయ అంతరిక్ష దినోత్సవంపై అవగాహన




**ఉరవకొండ టౌన్ – సూర్య వాస్తవం :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలు, సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం, జేకేసీ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. శైలజారాణి అధ్యక్షత వహించారు. ప్రతి ఏటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. 2023 ఆగస్టు 23న భారత్ చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతంలో విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌ను విజయవంతంగా ల్యాండ్ చేసి చారిత్రాత్మక ఘనత సాధించిందని వివరించారు. కార్యక్రమాన్ని కంప్యూటర్ అప్లికేషన్స్ లెక్చరర్ ఎం. సుధాకర్ నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ఎం. మృత్యుంజయ ఇస్రో అభివృద్ధి, విజయాలు, భారత అంతరిక్ష పరిశోధన కార్యక్రమం ప్రగతిని విద్యార్థులకు వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. మస్తానప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మాసినేని సుధాకర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం నిర్వహించనున్న జాతీయ అంతరిక్ష దినోత్సవ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని విద్యార్థు లందరూ వీక్షించి పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డా. బి. వెంకటరాముడు, సోము, నారాయణస్వామి, కిరణ్, వెంకటేశులు తదితర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను నాణ్యతతో, గడువులోగా పూర్తి చేయాలి

**- చిన్నమండెం ఉర్దూ పాఠశాలలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం** : ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా.. శనివారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చిన్నమండెం మండలంలోని ఉర్దూ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలోని పోలింగ్ స్టేషన్ 247, 249ఏఎస్డీ ASD జాబితా,తదితర కేసులు వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆయా కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేయడం, నోటీసుల అనంతరం నిర్వహించిన హియరింగ్‌కు హాజరైన వారి వివరాలపై ఆరా తీశారు. హియరింగ్‌కు హాజరుకాని ఓటర్ల విషయంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తహశీల్దార్ రామాంజనేయులు, ఎన్నికల శాఖ అధికారులు, ఎంపీడీవో శ్రీధర్ రెడ్డి, బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం





**నరసరావుపేట – సూర్య వాస్తవం:** స్థానిక పల్నాడు రోడ్‌లో గల శ్రీత్రికోటేశ్వర స్కాన్ సెంటర్‌లో ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ లింగస్వామి ఆధ్వర్యంలో 15 మంది చిన్నపిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగస్వామి మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలు చిన్న పిల్లల తల్లి తండ్రులు ఎవరు డబ్బుల గురించి ఆలోచించకుండా వారి పిల్లలను ఇలా వైద్యశిబిరం ఏర్పాటు చేసినప్పుడు తీసుకొని వస్తే వాళ్లను పరీక్షించి అవసరమైన వారికి హీరో మహేష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్లు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో డాక్టర్ లింగస్వామి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు అభిమానులు చిన్ని కృష్ణ, సుభాని, నాగేశ్వరరావు, బాజీ, కోటేశ్వరరావు, మన్నేపల్లి శ్రీను, సుభాని, సాగర్, బుచ్చిబాబు ఆంధ్రా హాస్పిటల్స్ రిలేషన్ మేనేజర్ ప్రసాద్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటును నమోదు చేసుకోవాలి

**- ఎన్నికల సంఘం ఆదేశాలు - అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి**



**దువ్వూరు – సూర్య వాస్తవం:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని,ఆ యా తేదిలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మీకు సంబందించిన గ్రామాలలో బీఎల్ఎలు అందు బాటులో ఉంటారని, కొత్త ఓటు కోసం ఫారం-6, అభ్యంతరాలకు ఫారం-7, మార్పులు, చేర్పులకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్లైన్లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. 2026 జూలై 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ అవకాశంను రాష్ట్రంలోని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జగన్ రెడ్డి సూచించారు.

# పరిశుభ్రతను జీవితంలో భాగంగా చేసుకోవాలి

**- చిన్నమండెంలో స్వచ్ఛత కార్యక్రమాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం** :శనివారం నిర్వ హించిన స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా "ఆరోగ్యవంతమైన పాఠశాలలు- - ఆరోగ్యవంతమైన ఆంధ్ర" థీమ్‌తో చేపట్టిన కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొని, చిన్నమండెం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన పాఠశాలలు, ఆరోగ్యకరమైన పరిసరాలు విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని తెలిపారు. చిన్నమండెంలోని ప్రాథమిక పాఠశాల (ఉర్దూ)ను జిల్లా కలెక్టర్ సందర్శించి పాఠశాల పరిసరాల్లో నిర్వహిస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలోని వీధి డ్రెయిన్లతో పాటు హైవే రోడ్డుకు సమీపంలో ఉన్న పెద్ద కాలువను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించి, డ్రెయిన్లలో నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. పరిశుభ్రత అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, నిరంతర ప్రక్రియగా కొనసాగాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాలు, పాఠశాలలు, ప్రధాన రహదారులు, డ్రెయిన్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించవచ్చని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, చెత్త నుంచి సంపద తయారీకి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ రెడ్డి, ఎమ్మార్వో రామాంజనేయులు, సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# యనమల భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పగడాల శివకుమార్



**చిట్వేలి– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా చిట్వేలి మండలం పవన్ కళ్యాణ్ ఆశయా లు నచ్చి ఉన్నత చదువులు చదువుకుని సాఫ్ట్వేర్ రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉన్నప్పటికీ కూడా పవన్ అన్న ఆశయాలను ఆలోచనలను ప్రజల్లోకి తీసుకువెళ్లి తను కూడా ప్రజలకు ఏదో సేవ చేయాలని సంకల్పంతో రాజకీయాలలోకి వచ్చిన యనమల భాస్కర్ నిజాయితీ నిబద్ధత నమ్మకం ఆయనకున్న లక్షణాలు అలాంటి వ్యక్తికి స్థానిక సంస్థల విధివిధానాల జనసేన రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించడం పట్ల చిట్వేలి మండలం టౌన్ చిరంజీవి యువత ప్రెసిడెంట్ పగడాల శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు పవన్ కళ్యాణ్ ఆశయాలను లక్ష్యాలను ప్రజల్లేకి తీసుకువెళ్లడానికి కచ్చితంగా తమ కృషి చేస్తామని కేవలం జనసేన బలపడడానికి మాత్రమే తమ ప్రయత్నం చేస్తామని అధ్యక్షుడు నిర్ణయాన్ని వ్యతిరేకించడం లాంటి చర్యలు తమ తీసుకోమని అన్ని విధాలుగా ఆలోచన చేసే పవన్ అన్న నిర్ణయం తీసుకుంటారని అని ఆయన అన్నారు తను పవన్ కళ్యాణ్ ను సీఎం చేయడానికి 24 గంటలు కష్టపడడానికి సిద్ధంగా ఉన్నానని తన ఆశ కోరిక అని మంచి మనసు కోట్ల సంపాదన వదులుకొని రాజకీయాలలోకి వచ్చి అనరాని మాటలు పడి నేడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా వెలుగు లేని గ్రామాలకి వెలుగుని ప్రసాదించి డోలిమోతల నివారణకు రోడ్లు వేయించి సమస్య ఎక్కడ ఉంది అంటే అక్కడ పవన్ కళ్యాణ్ ప్రజలకు గుర్తించే విధంగా నిర్ణయాలు తీసుకుంటూ ఆంధ్ర రాష్ట్ర ప్రజల ఆత్మబంధువుగా పిలువబడుతున్నాడని ఆయన స్థాపించిన పార్టీలో ఉండడం గర్వపడు తున్నానని అన్నారు.

# బోధనలో నాణ్యతే లక్ష్యం..

**- కాంప్లెక్స్ సమావేశాలతో ఉపాధ్యాయుల నైపుణ్యాలకు పదును**
**- బోధనలో నూతనత్వం అవసరం**
**- పాఠ్య ప్రణాళిక, మూల్యాంకన విధానాలపై ప్రత్యేక దృష్టి**
**- తరగతి గది బోధనా వ్యూహాలపై ఉపాధ్యాయులకు అవగాహన**
**- డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం**

రాయచోటి: విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి సూచించారు. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం ప్రారంభమైన సందర్భంగా రాయచోటిలోని గర్ల్స్ హైస్కూల్, డైట్‌లో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి సమావేశాల్లో చర్చిస్తున్న అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో కాంప్లెక్స్ సమావేశాలను పూర్తి రోజు నిర్వహిస్తున్నామని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమావేశాలు కొనసాగుతాయని చెప్పారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయుల సబ్జెక్ట్ నాలెడ్జ్‌ను బలోపేతం చేయడం, నూతన బోధనా పద్ధతులపై అవగాహన పెంపొందించడం, సమర్థవంతమైన పాఠ్య ప్రణాళిక రూపొందించడం, బోధన-- అభ్యసన సామగ్రి తయారీ తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలను ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధికి ఉపయోగపడే వేదికలుగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాల్లోని క్లిష్టమైన భావనలను గుర్తించి, వాటిని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించే విధానాలపై ఉపాధ్యా యులు పరస్పరం చర్చించుకోవాలని నరసింహారెడ్డి సూచించారు. బోధనలో నూతన పద్ధతులు, సాంకేతి కత, సృజనాత్మకతను వినియోగించడం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి, చురుకుదనం పెంపొందించాలన్నారు.

విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేసి, అవసరమైన చోట పునర్బోధన చేపట్టడం ద్వారా అభ్యసన ఫలితాలను మరింత మెరుగుపరచవచ్చన్నారు. ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు, ఉత్తమ బోధనా పద్ధతులను పరస్పరం నేర్చుకునేలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు గిరిబాబు యాదవ్, మోహన్ నాయక్, క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైరాబాను, నిర్మల, రిసోర్స్ పర్సన్స్ మహబూబ్ సుభహాన్, కృష్ణ కిషోర్ రెడ్డి, అబ్బవరం హరిబాబు, అమానుల్లా, సెకండరీ గ్రేడ్ టీచర్స్, గణిత, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మెగాస్టార్ చిరంజీవి పేరున నిత్య అన్నదానానికి విరాళం

**- మెగాస్టార్ వీరాభిమాని అమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య వితరణ**



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** మాజీ కేంద్రమంత్రి మెగాస్టార్ కొణిదెల చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన వీరాభిమాని బ్రహ్మంగారిమఠం మండల కాపునాడు ఉపాధ్యక్షుడు సీనియర్ విలేకరి అంబిశెట్టి వెంకటసుబ్బయ్య శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకుని మెగాస్టార్ చిరంజీవి పేరు మీదగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి తెలుగు సినీ పరిశ్రమలో మెగాస్టార్‌గా కోట్లాది మంది అభిమానుల మనసుల్లో స్థానం సంపాదించుకున్న చిరంజీవి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. వారికి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులు ఆయనకు ఎల్లవేళలా ఉండాలని కోరు కున్నారు. చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన పేరుతో ప్రతి సంవత్సరం అన్నదానం కొనసాగించేలా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం శాశ్వత నిత్య అన్నదాన పథకానికి నగదు విరాళాన్ని అందజేశారు. అనంతరం మఠాధిపతి శ్రీవీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు మఠాధిపతి సోదరుడు శ్రీ దత్తాత్రేయ స్వాములవారి చేతుల మీదుగా విరాళానికి సంబంధించిన రసీదును స్వీక రించారు. ఈ కార్యక్రమంలో పలువురు చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

# నాన్నా.. నువ్వే నా తొలి హీరో: రామ్ చరణ్

**మెగాస్టార్ చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రామ్ చరణ్**
**నాన్నే తన తొలి హీరో, గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్న చరణ్**
**తనపై నాన్న ఉంచిన నమ్మకమే అతిపెద్ద బలమని వెల్లడి**
**సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ సందేశాన్ని పంచుకున్న గ్లోబల్ స్టార్**



మెగాస్టార్ చిరంజీవి శనివారం (ఆగస్టు 22) తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో, ఆయన తనయుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తండ్రికి సోషల్ మీడియా వేదికగా అత్యంత హృద్యమైన రీతిలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. తన జీవితంలో తండ్రి స్థానం ఏమిటో వివరిస్తూ చరణ్ పెట్టిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది.ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో చరణ్ ఓ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్నా. మీరే నా మొదటి హీరో, నా అతిపెద్ద స్ఫూర్తి. ప్రతి విషయంలో నేను సంప్రదించేది మిమ్మల్నే. నా జీవితంలోని ప్రతి ఎత్తుపల్లంలో మీ ప్రేమ, మార్గదర్శకత్వం, నాపై మీరు ఉంచిన నమ్మకమే నాకు అతిపెద్ద బలంగా నిలిచాయి. మీరు నా జీవితంలో ఉండటం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. మీకు సంపూర్ణ ఆరోగ్యం, సంతోషం కలగాలని, మరెన్నో అద్భుతమైన సంవత్సరాలు గడపాలని కోరుకుంటున్నాను. మాటల్లో చెప్పలేనంత ప్రేమతో... నాన్నా" అని రాసుకొచ్చారు.తండ్రిపై తనకున్న ప్రేమను, గౌరవాన్ని రామ్ చరణ్ ఎన్నో సందర్భాల్లో చాటుకున్నారు. తాజాగా ఆయన చేసిన ఈ పోస్ట్ తండ్రీకొడుకుల మధ్య ఉన్న బలమైన అనుబంధాన్ని, తన ఎదుగుదలలో చిరంజీవి పాత్ర ఎంత కీలకమో మరోసారి స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం రామ్ చరణ్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మెగా అభిమానులు ఈ పోస్ట్‌ను విస్తృతంగా షేర్ చేస్తూ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# 'ఇరుముడి' ఫస్టు డే కలెక్షన్స్ ఇవే!




రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వం వహించిన 'ఇరుముడి' నిన్ననే థియేటర్లకు వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ వారు ఈ సినిమాను నిర్మించారు. అయ్యప్పస్వామి భక్తుడిగా రవితేజ కనిపించడం .. ఈ సినిమా నుంచి సాంగ్స్ కి అనూహ్యమైన రెస్పాన్స్ రావడం బాగా కలిసొచ్చింది. దాంతో ఈ మధ్య కాలంలో థియేటర్స్ దగ్గర ఎప్పుడూ కనిపించని సందడి ఈ వారం కనిపించింది. ఆన్ లైన్ లో చకచకా టికెట్స్ అమ్ముడయ్యాయి.నిజానికి రవితేజ మినహా మిగతా ఆర్టిస్టులంతా ఓ మాదిరి క్రేజ్ ఉన్నవారే. ఇక రవితేజతో పాటు తెరపై పూర్తి స్థాయిలో కనిపించిన పాప 'నక్షత్ర' కూడా ఇక్కడి ప్రేక్షకులకు పరిచయం లేదు. అయినా విడుదలకు ముందు నుంచి ఈ సినిమా మంచి బజ్ ను సంపాదించుకుంది. రవితేజ క్రేజ్ .. 'ఇరుముడి' అనే టైటిల్ .. ట్రైలర్ .. సాంగ్స్ అందుకు కారణంగా చెప్పుకోవచ్చు. అలాంటి ఈ సినిమా, విడుదలైన తొలిరోజునే ప్రపంచవ్యాప్తంగా 24 కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసినట్టుగా తెలుస్తోంది.అయ్యప్పస్వామి వైపు నుంచి ఉన్న డివోషనల్ టచ్. ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి కథానాయకుడు కావడం .. కూతురుపై అతనికి గల ప్రేమ .. తాను ఉన్నానంటూ కూతురుకు అండగా నిలిచే తీరు .. ఆడపిల్లల్లో భయాన్ని కాదు, ధైర్యాన్ని నింపాలి అనే సందేశం ఆడియన్స్‌కి బాగా కనెక్ట్ అయ్యాయి. కథాకథనాలు ఈ సినిమాకి ప్రధానమైన బలంగా నిలిచాయి. లొకేషన్స్ ను కవర్ చేసిన విధానం .. హుషారెత్తించే పాటలు .. అందుకు తగిన కొరియోగ్రఫీ ఈ సినిమా సక్సెస్‌లో ముఖ్యమైన పాత్రను పోషించాయి. ఈ సినిమా దూకుడు ఇప్పట్లో తగ్గనట్టే కనిపిస్తోంది మరి.



## బాలీవుడ్ లో ఏజ్ గ్యాప్ పై
## మనీషా వ్యాఖ్యలు మరోసారి వైరల్

బాలీవుడ్‌లో హీరో, హీరోయిన్ల మధ్య వయసు అంతరం, మహిళా నటులు ఎదుర్కొంటున్న వివక్షపై సీనియర్ నటి మనీషా కొయిరాలా చేసిన కొన్ని పాత వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. ప్రముఖ నటి సిమీ గరేవాల్ నిర్వహించిన 'రెండవూ విత్ సిమీ గరేవాల్' అనే చాట్ షోలో పాల్గొన్నప్పుడు ఆమె ఈ అభిప్రాయాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా మనీషా మాట్లాడుతూ.. "ఇది నిజంగా చాలా బాధాకరమైన విషయం. మన పరిశ్రమలో మనవళ్లు, మనవరాళ్లు ఉన్న నటులు కూడా ఇప్పటికీ హీరోలుగా నటిస్తున్నారు. కానీ ఒక నటికి పెళ్లి అయిందంటే చాలు, ఆమెను ఇక సినిమాలకు పనికిరాదన్నట్టు చూస్తారు. హీరో, హీరోయిన్ల మధ్య వయసు అంతరం స్పష్టంగా కనిపిస్తుంది. 40, 50 ఏళ్ల హీరో పక్కన కుర్ర హీరోయిన్ ఎందుకు? 40 ఏళ్లు పైబడిన హీరోయిన్ ఎందుకు ఉండకూడదు?" అని ప్రశ్నించారు.పరిశ్రమలో మహిళలపై ఎన్నో ఆంక్షలు ఉన్నాయని, అయితే కాలక్రమేణా మహిళలు వాటికి వ్యతిరేకంగా పోరాడతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి సిమీ గరేవాల్ స్పందిస్తూ.. సినిమాల్లో హీరోయిన్లను కేవలం హీరో కోరికలను తీర్చే ఒక వస్తువుగా చూడటం వల్లే ఈ పరిస్థితి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.సిమీ వ్యాఖ్యలపై మనీషా స్పందిస్తూ, "ఒకరిచేత ఆరాధించబడటం మంచి విషయమే. కానీ కేవలం దానికే పరిమితం చేస్తే అది బాధాకరం. ఈ పరిస్థితిని మార్చడానికి మహిళలు కూడా ముందుకు రావాలి. తమ ప్రతిభతో, నటనతో నిరూపించుకోవాలి. నా శరీరాన్ని కాదు, నా పనిని, నా టాలెంట్‌ను చూడండి అని చెప్పగలగాలి. తెలివిగా వ్యవహరించి, ప్రజల దృష్టిని శరీరం నుంచి నటన వైపు మళ్లించాలి" అని వివరించారు. ఈ పాత ఇంటర్వ్యూ ఇప్పుడు మళ్లీ తెరపైకి రావడంతో, చిత్ర పరిశ్రమలో లింగ వివక్షపై చర్చ మరోసారి ఊపందుకుంది.



## శ్రీలంకతో రెండో టెస్టుకు ముందు
# కుల్దీప్‌కు గంభీర్ కీలక సూచన!



శ్రీలంకతో ఆదివారం ప్రారంభమయ్యే రెండో టెస్టు నేపథ్యంలో జట్టు కూర్పుపై చర్చ జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు చేశాడు.గాలేలో జరిగిన తొలి టెస్టులో కుల్దీప్ ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టులో అతడి స్థానం గురించి చర్చ జరుగుతోంది. జట్టులో సారాంశ్ జైన్ రూపంలో మరో స్పిన్ ఆల్‌రౌండర్ కూడా అందుబాటులో ఉన్నాడు.అయితే టెస్టు మ్యాచ్ గెలవాలంటే 20 వికెట్లు తీయగల అత్యుత్తమ బౌలింగ్ దళాన్ని ఎంపిక చేస్తామని గంభీర్ స్పష్టం చేశాడు. పరిస్థితులను బట్టి తుది జట్టును నిర్ణయిస్తామని చెప్పాడు.కుల్దీప్‌తో తన చర్చల గురించి మాట్లాడుతూ.. వికెట్ల కోసం అత్యాశ పడకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపాడు. రిస్ట్ స్పిన్నర్లు వికెట్ల కోసం ఆత్రుత పడితే బౌలింగ్‌పై నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నాడు.కుల్దీప్ సామర్థ్యంపై తమకు పూర్తి నమ్మకం ఉందని గంభీర్ పేర్కొన్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అతడు ప్రమాదకర బౌలర్‌గా మారగలడని తెలిపాడు. అయితే పరిస్థితులకు అనుగుణంగా ఫలితం ఇచ్చే బౌలింగ్ దళానికే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశాడు.గాలే టెస్టు పిచ్‌పై కూడా గంభీర్ సంతృప్తి వ్యక్తం చేశాడు. స్పిన్నర్లు, పేసర్లు, బ్యాటర్లకు ఆ పిచ్ సహకరించిందని అన్నాడు.

ఐదు రోజుల పాటు తీవ్రంగా శ్రమిస్తేనే టెస్టు మ్యాచ్ గెలవగలమని చెప్పాడు.అలాగే ఐదుగురు ప్రధాన బౌలర్లతో ఆడటం జట్టుకు వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని పేర్కొన్నాడు. ఫ్లాట్ పిచ్‌లపై బౌలర్లను రొటేట్ చేసేందుకు ఇది అవకాశం ఇస్తుందని తెలిపాడు.

## తొలి బంతికే వికెట్..
# మిచెల్ స్టార్క్ సరికొత్త రికార్డు!




ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ క్రికెట్‌లో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక టెస్టు మ్యాచ్ ఆరంభంలో, వేసిన తొలి బంతికే వికెట్ పడగొట్టడం అతనికి ఇది నాలుగోసారి కావడం విశేషం. ఈ అరుదైన ఘనత సాధించిన ప్రపంచపు తొలి బౌలర్‌గా స్టార్క్ చరిత్ర సృష్టించాడు.సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో స్టార్క్ ఈ మైలురాయిని చేరుకున్నాడు. మ్యాచ్‌లో బౌలింగ్ ప్రారంభించిన అతను, తను వేసిన మొదటి బంతికే బంగ్లాదేశ్ ఓపెనర్ షాద్మాన్ ఇస్లాంను పెవిలియన్ పంపాడు. కామెరూన్ గ్రీన్ పట్టిన క్యాచ్‌తో షాద్మాన్ వెనుదిరిగాడు.గతంలో వెస్టిండీస్ మాజీ ఫాస్ట్ బౌలర్ పెడ్రో కొలిన్స్ టెస్టుల్లో మూడుసార్లు మ్యాచ్ తొలి బంతికే వికెట్ పడగొట్టాడు. ఇందులో అత్యంత ఆసక్తికరమైన అంశమేమిటంటే, ఆ మూడు సందర్భాల్లోనూ కొలిన్స్ బంగ్లాదేశ్ ఓపెనర్ హన్నన్ సర్కార్‌ను ఔట్ చేయడం గమనార్హం.ఈ వికెట్‌తో మిచెల్ స్టార్క్ మరో ఘనతను కూడా అందుకున్నాడు.

టెస్ట్ మ్యాచ్ ఆరంభ ఓవర్‌లో అత్యధిక వికెట్లు తీసిన మాజీ ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ అండర్సన్ (8) రికార్డును ఆసీస్ పేసర్ అధిగమించాడు. ఇక టెస్టుల్లో ఏ ఇన్నింగ్స్‌లోనైనా మొదటి ఓవర్‌లో అత్యధిక వికెట్లు (28) తీసిన రెండో బౌలర్‌గా స్టార్క్ నిలిచాడు. ఈ జాబితాలో జేమ్స్ అండర్సన్ 29 వికెట్లతో ప్రస్తుతం అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.




## ప్రపంచ బ్యాడ్మింటన్:
# గాయత్రి-ట్రీసా జోడీకి కాంస్యం

**ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో గాయత్రి-ట్రీసాకు కాంస్యం**
**సెమీఫైనల్‌లో చైనా జోడీ చేతిలో ఓటమి**
**మూడు గేమ్‌ల పాటు సాగిన హోరాహోరీ పోరు**
**తొలి గేమ్ గెలిచినా పుంజుకోలేకపోయిన భారత జోడీ**
**ఇటీవలే అర్జున అవార్డుకు ఎంపికైన గాయత్రి-ట్రీసా**

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల డబుల్స్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్ - ట్రీసా జాలీ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. శనివారం జరిగిన హోరాహోరీ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఈ జోడీ పరాజయం పాలవడంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇటీవలే ప్రతిష్ఠాత్మక అర్జున పురస్కారానికి ఎంపికైన ఈ ద్వయం, ఈ మెగా టోర్నీలోనూ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. సెమీఫైనల్‌లో గాయత్రి-ట్రీసా జోడీ చైనాకు చెందిన లియు షెంగ్షు, టాన్ నింగ్ ద్వయంతో తలపడింది. మూడు గేమ్‌ల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ 21-18, 13-21, 8-21 తేడాతో ఓటమిని చవిచూసింది. తొలి గేమ్‌లో ఇరు జట్ల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఒక దశలో 16-18తో వెనుకబడినప్పటికీ, అద్భుతంగా పుంజుకున్న గాయత్రి-ట్రీసా 21-18తో గేమ్‌ను సొంతం చేసుకున్నారు. అయితే, ఆ తర్వాత చైనా జోడీ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. రెండో గేమ్‌ను 21-13తో, నిర్ణయాత్మక మూడో గేమ్‌ను 21-8తో సునాయాసంగా గెలుచుకుని ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ ఓటమితో గాయత్రి-ట్రీసా జోడీ ప్రస్థానం కాంస్య పతకంతో ముగిసింది.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# బీసీలకు 34శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణపై హర్షం



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** ఇచ్చిన మాటకు కట్టుబడి బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించడంపై దొరవారిసత్రం మండలంలోని కూటమి నాయకులు హర్షం వ్యక్తంచేశారు. శనివారం దొరవారిసత్రం తెలుగుదేశం పార్టీ ఆఫీస్ నందు బీసీ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ దివంగత మహానేత ఎన్టీఆర్ బీసీలకు రాజకీయంగా, సామాజికంగా అండగా నిలిచి రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. అయితే గత ప్రభుత్వం జీవో నెం.559, 560లతో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి దాదాపు 16,800 మంది బీసీ ప్రతినిధుల రాజకీయ అవకాశాలను దెబ్బతీశారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు.నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు తిరిగి 34శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి బీసీల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఇంకా పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఇట్టగుంట రత్నయ్య,క్లస్టర్ ఇంచార్జి సంచి విజయకుమార్,మైనారిటి సెల్ నాయకులు ఎస్.కె షబ్బీర్,బట్టా శ్రీనివాసులు,సమాధి సుబ్రమణ్యం, ఊపాటి చెంగయ్య,నేలపట్టు రామయ్య, విజయభాస్కర్, నరసింహులు, యాబాక వెంకటస్వామి, గడ్డాం మంగయ్య, ఎస్.కె బాబర్, కాటూరు మణి, పొంకం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చిరంజీవి జన్మదిన సందర్భంగా అన్నదానం





**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణం మెగా ఫోర్స్ యూత్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ పద్మభూషణ్ చిరంజీవి జన్మదిన సందర్భంగా అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి తదుపరి 300 మందికి అన్నదానం చేయడం జరిగినది.

మెగాఫోర్స్ యూత్ రాష్ట్ర కో కన్వీనర్ మాభాష మాట్లాడుతూ మా సేవ స్ఫూర్తి మా అన్నయ్య పద్మ విభూషణ్ డాక్టర్ చిరంజీవి జన్మదినము సందర్భంగా నాలాంటి యువకులను ఎంతోమందిని సేవా మార్గంలో మరియు రాజకీయ వైపు నడిపించిన మార్గదర్శి సేవ స్ఫూర్తి గత 15 సంవత్సరాల నుండి సూళ్లూరుపేట పట్టణంలో రక్త దానాలు అన్నదానాలు ఎన్నో సేవా కార్యక్రమాలు చిరంజీవి సేవ స్ఫూర్తితో చేస్తున్నా మని చిరంజీవి నిండు నూరేళ్లు సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు అందులో భాగంగానే ఈరోజు కేక్ కటింగ్ అన్నదానం చేయడం జరిగిందని అన్నారు. అలాగే సూళ్లూరుపేట పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చామని ఈ కార్యక్రమాలు అన్నిటికీ సహకరించిన చిరంజీవి సేవా సంఘం సభ్యులకు, మాబాషా ధన్యవాదాలను తెలిపారు.ఈ కార్యక్రమములో చిరంజీవి సేవా సంఘం సభ్యులు కయ్యాల కోట యాదవ్,పూల శివకుమార్,నవీన్, వీర మహిళ సుజాత,ఆవుల దాస్,ఏంబేటి ప్రవీణ్, రాజేష్,కుమార్,రంజిత్,తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయాలి

**- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** దేశవ్యాప్తంగా బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయాలి అని ఆంధ్ర రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆయన శనివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జాతీయ పదాధికారుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సతీష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడం,ప్రజా సంక్షేమం, సంస్థాగత అంశాలు, భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్--2047లక్ష్య సాధనలోపార్టీని మరింత బలోపేతం చేస్తూ,ప్రజలకు మరింత చేరువగా పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ సంకల్పించారు.

# ప్లాస్టిక్ రహిత సూళ్లూరుపేటే లక్ష్యం..

**- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వినూత్న అవగాహన**

**-స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బజారు వీధుల్లో విస్తృత పర్యటన**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మున్సిపాలిటీలో స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వినూత్న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత పట్టణమే లక్ష్యం అనే ఉద్దేశంతో సూళ్లూరుపేట పట్టణంలోని బజారు వీధుల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్య టించారు. ఈ సందర్భంగా వివిధ దుకాణాలను స్వయంగా సందర్శించి వ్యాపారులు, దుకాణ యజమానులతో మాట్లాడారు. రోజువారీ వ్యాపారాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియో గాన్ని వీలైనంత వరకు తగ్గించాలని సూచి ంచారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పర్యావరణహిత సంచులను వినియోగించాలని, వినియోగదారులకు కూడా వాటినే అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోవడం వల్ల మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడటంతో పాటు పట్టణ పరిశుభ్రతకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యా వరణానికి నష్టం కలగడమే కాకుండా పశువులు,ఇతర జీవరాశులకు కూడా ప్రమాదం ఏర్పడుతోందని తెలిపారు.ప్రతి దుకాణ దారుడు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు బాధ్య తగా వ్యవహరించాలని, ప్రజలు మార్కెట్‌కు వెళ్లేటప్పుడు పునర్వినియోగ సంచు లను వెంట తీసుకెళ్లే అలవాటును పెంపొందించు కోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పట్టణ పరిశుభ్రత కేవలం మున్సిపాలిటీ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, వ్యాపారులు, అధికారులు సమష్టిగా భాగస్వాములైనప్పుడే స్వచ్ఛమైన సూళ్లూరుపేట సాధ్యమవుతుందని పేర్కొన్నారు.స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని నియం త్రించేందుకు నిరంతరం కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. వ్యాపారులు, ప్రజలు, మున్సిపల్ సిబ్బంది సమ న్వయంతో పనిచేస్తే సూళ్లూరుపేటను మరింత పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వ్యాపారులు, స్థానికులు పాల్గొని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

# వ్యాపార సంస్థల భద్రతపై ప్రత్యేక దృష్టి

**-చోరీల నివారణకు బహుళస్థాయి భద్రత**
**- చోరీ జరిగిన తర్వాత స్పందించడం కంటే..**
**- ముందుగానే నివారించడమే ఉత్తమ భద్రతా చర్య**
**- జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు**
**- గోల్డ్ షాపులు, పాన్ బ్రోకర్లు, బ్యాంకులు, ఎలక్ట్రానిక్ షాపులు,**
**- ఆటో డీలర్ల ప్రతినిధులతో జిల్లా ఎస్పీ సమావేశం**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లాలో వ్యాపార సంస్థల్లో చోరీలను అరిక ట్టడం, వ్యాపారులు మరియు సంస్థల ఆస్తులు, నగదు,విలువైన వస్తువులకు భద్రత కల్పించడం లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.ఇందులో భాగంగా గోల్డ్ షాపులు, పాన్ బ్రోకర్లు,బ్యాంకులు,ఎలక్ట్రానిక్ షాపులు, ఆటో డీలర్లు తదితర సంస్థల ప్రతినిధులతో తిరుపతి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీఎల్. సుబ్బ రాయుడు, అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. తిరుపతి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారని, అదే సమయంలో ఇతర ప్రాంతాల నుంచి నేరస్థులు వచ్చే అవకాశాలను కూడా దృష్టిలో ఉంచుకుని వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని సూచి ంచారు. దొంగతనం జరిగిన తర్వాత స్పంది ంచడం మాత్రమే కాదు.. అసలు దొంగతనం జరగ కుండా ముందుగానే నివారించడమే మన ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు.కేవలం సీసీటీవీ కాదు. బహుళస్థాయి భద్రత చాలా అవసరం,వ్యాపార సంస్థలు కేవలం సీసీటీవీ లేదా సెక్యూరిటీ గార్డుపై ఆధారపడకుండా బహుళస్థాయి భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రధాన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వెనుక ద్వారాలు, పైకప్పు మార్గాలు, కిటికీలు,పార్కింగ్ ప్రాంతాలు, సంస్థ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు, నైట్ విజన్ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. షట్టర్లపై వైబ్రేషన్/సీస్మిక్ సెన్సర్లు,గాజు ప్రాంతాల్లో గ్లాస్ బ్రేక్ సెన్సర్లు, పరిసర ప్రాంతాల్లో మోషన్ డిటెక్షన్, ఇన్‌ట్రూజన్ అలర్ట్, సెన్సార్ లైటింగ్,నగదు కౌంటర్ల వద్ద సైలెంట్ పనిక్ అలారమ్ వంటి భద్రతా వ్యవస్థలను అవసరానికి అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**సీసీటీవీ ధ్వంసమైనా ఆధారాలు మిగలాలి,**

కెమెరా ఎక్కడ ఉందో దొంగకు ముందే అర్థం కాకుండా కొన్ని కెమెరాలను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేయాలి. సీసీటీవీను పగులగొట్టి డీవీర్/ఎన్వీఆర్ తీసుకెళ్లినా కీలక ఆధారాలు నష్టపోకుండా ప్రత్యామ్నాయ కెమెరాలు,రిమోట్/క్లౌడ్ బ్యాకప్ ఉండాలి అని జిల్లా ఎస్పీ సూచించారు. అధిక విలువైన వస్తువులు,నగదు కలిగిన సంస్థలు అవసరమైన చోట ఏఎన్ పిఆర్/నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాస్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.భౌతిక భద్రతతో పాటు సైబర్ భద్రత కూడా కీలకం,ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపార సంస్థలకు భౌతిక చోరీలతో పాటు సైబర్ మోసాల నుంచి కూడా రక్షణ అవసరమని జిల్లా ఎస్పీ తెలిపారు. యూపీఐ,క్విర్,పిఓఎస్ ఆన్‌లైన్ బ్యాంకింగ్, కంప్యూటర్లు, సీసీటీవీ /డీవీర్/ఎన్ వి ఆర్,వై-ఫై , ఈ-మెయిల్ తదితర వ్యవస్థలకు బలమైన పాస్‌వర్డ్‌లు,టు-ఫ్యాక్టరీ అంతేంటికేషన్,పరిమిత యాక్సెస్,సురక్షిత బ్యాకప్ వంటి చర్యలు పాటించాలని సూచించారు. నకిలీ పేమెంట్ స్క్రీన్‌షాట్లు,క్విర్ కోడ్ మార్పులు, ఫేక్ కస్టమర్ కేర్ కాల్స్, రిమోట్ ఆక్సిస్ యాప్స్,ఓటీపీ/పాస్‌వర్డ్‌లు అడిగే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సైబర్ మోసం జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా సంబంధిత బ్యాంకు/పేమెంట్ సంస్థకు సమాచారం అందించడంతో పాటు 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ప్రతి వ్యాపార సంస్థ తమ భద్రతా వ్యవస్థపై క్రమం తప్పకుండా సెక్యూరిటీ ఆడిట్, నిర్వహించు కోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. సీసీటీవీలు పనిచేస్తున్నాయా, తేదీ--సమయం సరిగ్గా ఉందా, డీవీర్/ఎన్ విఆర్ మరియు బ్యాకప్ సురక్షితంగా ఉన్నాయా, షట్టర్లు, వెనుక మార్గాలు భద్రంగా ఉన్నాయా, సెన్సర్లు, అలారాలు పనిచేస్తున్నాయా అనే అంశాలను నిరంతరం తనిఖీ చేసి లోపాలను వెంటనే సరిచేసుకోవాలని తెలిపారు.

ఉద్యోగులు, సెక్యూరిటీ గార్డులు,తాత్కాలిక సిబ్బంది వివరాలను ధృవీకరించుకోవాలని, సంస్థ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని అనవసర వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. వ్యాపార సంస్థల భద్రతా వ్యవస్థలను పోలీసు కంట్రోల్ రూమ్/కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేసుకునే అంశంపై సమావేశంలో చర్చ జరిగింది. బ్యాంకు ప్రతినిధులు కూడా ఈ అంశంపై ఆసక్తి వ్యక్తం చేయగా, సాధ్యమైన విధానంలో సమన్వయం చేసేం దుకు చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు. మీ షాపు భద్రత మాత్రమే కాదు. మీ చుట్టుపక్కల ప్రాంతం భద్రత కూడా మీ బాధ్యతగా భావించాలి.అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి,అని జిల్లా ఎస్పీ కోరారు. తిరుపతిని సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం, వ్యాపారులు ఎంతో కష్టపడి సంపాదించిన ఆస్తులు, నగదు, విలువైన వస్తువులకు భద్రత కల్పించడం అందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. పోలీసుల నిఘా ఒక్కటే సరిపోదు. వ్యాపారులు భద్రతా వ్యవ స్థలను బలోపేతం చేసుకోవాలి. ప్రజలు అప్రమ త్తంగా ఉండాలి. పోలీసులు--వ్యాపారులు--ప్రజలు సమన్వయంతో పనిచేస్తే తిరుపతి జిల్లాను మరింత సురక్షితమైన జిల్లాగా తీర్చిదిద్దగలమని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాసులు (పరిపాలన),అదనపు ఎస్పీ రవి మనోహర్ ఆచారి (శాంతిభద్రతలు), ఐ రామకృష్ణ (తిరుమల) తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, ఇతర పోలీసు అధికారులు, గోల్డ్ షాపులు,పాన్ బ్రోకర్లు, బ్యాంకులు, ఎలక్ట్రానిక్ షాపులు, ఆటో డీలర్లు తదితర వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : M. SULEMAN SAHEB H. No 158/56 UMA NAGAR, ANANTHAPURAM ANDHRA PRADESH - 515001. CELL : : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )